
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025

6న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల ఆరోతేదీని నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కార్యదర్శి బీవీరమణను ఆదేశించారు. ఇప్పటివరకు 230 ప్రతిపాదనలు అజెండాలో చేర్చినట్టు తెలిసింది. శుక్రవారం వరకు ప్రతిపాదనలు స్వీకరించే అవకాశం ఉండడంతో అజెండాలో 300కిపైగా అంశాలుంటాయని భావిస్తున్నారు. కార్యదర్శి పేషీకి అందిన అంశాల్లో యోగాంధ్రకు సంబంధించిన పనులకు బిల్లు చెల్లింపు అంశాలే ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది.

నగరానికి మణిహారం

కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం

- సందర్శకులను అనుమతిస్తున్న అధికారులు


గ్లాస్ బ్రిడ్జి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరానికి పర్యాటకంగా మరో మణిహారం అందుబాటులోకి వచ్చింది. కైలాసగిరిపై రూ.7 కోట్లతో నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని సోమవారం ప్రారంభించి సందర్శకులను అనుమతిస్తున్నారు. నాలుగు నెలల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకున్న గ్లాస్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని భావించారు. ప్రతిసారీ కార్యక్రమం వాయిదా పడుతుండడంతో సోమవారం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్‌తో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కైలాసగిరిపై ఇప్పటికే స్కై సైక్లింగ్, పారా గ్లైడింగ్ అందుబాటులోకి వచ్చాయన్నారు. హుద్‌హుద్ వంటి భారీ తుపాన్లను కూడా తట్టుకొని నిలబడేలా గ్లాస్ బ్రిడ్జి నిర్మించామన్నారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్, ఢమరుకం నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. చీకటి పడిన తరువాత నగర ప్రజలకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్

... మిగతా 6వ పేజీలో

జలం.. పుష్కలం

జిల్లాలో భారీగా పెరిగిన భూగర్భజలాలు

- మేలు చేసిన మొంథా తుఫాన్
- జిల్లాలో సగటు భూగర్భజల మట్టం 4.37 మీటర్లు
- గత ఏడాది నవంబరు కంటే 1.26 మీటర్లు పెరుగుదల


ఆనందపురం మండలంలో వర్షాలకు బావిలో పైకి వచ్చిన నీరు

- ఎండాడ, ఆరిలోవ, మధురవాడ, రుషికొండలో ఆందోళనకరమే!

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో నగరం, పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగాయి. ఈ ఏడాది అక్టోబరు మూడో వారం వరకు చెప్పుకోదగ్గ వర్షాలు లేవు. ఆనెల చివరివారంలో మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలు ఆదుకున్నాయి. దీంతో భూగర్భజల మట్టాలు భారీగానే పెరిగాయి.

ఈ ఏడాది జిల్లాలో సగటున అక్టోబరు మాసంలో భూగర్భ జల మట్టం 5.43 మీటర్లలోతుండగా, నవంబరుమూడో వారానికి 4.37 మీటర్లకు పెరిగింది. గత ఏడాది నవంబరులో సగటున 5.6 మీటర్లలోతున జలాలుండగా ఈ ఏడాది నవంబరులో 4.37 మీటర్లకు పెరిగింది. దీంతో గత ఏడాది కంటే 1.26 మీటర్లు పెరిగాయి. దీంతో భూగర్భజలాలపై ఒత్తిడి తగ్గింది. అయినప్పటికీ రుషికొండ, ఎండాడ, ఆరిలోవ, మధురవాడ, వడ్లపూడి కణితకాలనీ, తదితర జనసమ్మర్థ ప్రాంతాల్లో భూగర్భజలాలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఫలితంగా గత ఏడాది కంటే మరింత లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో గత ఏడాది కంటే జలాలు పెరిగాయి. వేసవిలో వర్షాలు తగ్గడం, నీటి వినియోగం పెరగడంతో భూగర్భజలాలపై ఒత్తిడి పెరుగుతుంది. నగరంలో కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో నీటి వినియోగం పెరుగుతోంది. ఎండాడ, మధురవాడ, రుషికొండ, కూర్మన్నపాలెం పరిసరాల్లో నగరంలో అనేకరేట్లు పెరిగింది. ఆరిలోవ హెల్త్ సిటీలో ఆస్పత్రులు అధికంగా నీటిని వినియోగిస్తుండడంతో అక్కడ భూగర్భజలాలు ఆందోళనకర స్థితికి పడిపోయాయి. దీంతో ఈ ప్రాంతాల్లో భూగర్భ మట్టాలు 10 మీటర్ల కంటే లోతుకు వెళ్లిపోతున్నాయి.

మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు భూగర్భజల మట్టాలు పెరగడం ఉపశమనం కలిగించింది. గత ఏడాది నవంబరులో ఆనందపురం మండలం పందలపాకలో 3.61 మీటర్ల లోతులో ఉండే భూగర్భజల మట్టం ఈ ఏడాది నవంబరులో 1.88 మీటర్లకు చేరింది. వెల్లంకిలో గత ఏడాది 6.79 మీటర్లు ఉండగా ఈ ఏడాది 1.75, శొంఠ్యాంలో 4.74 నుంచి 2.18 మీటర్ల పైకి వచ్చింది. భీమిలి మండలం నగరంపాలెంలో 4.63 మీటర్ల నుంచి 3.25 మీటర్లు, పద్మనాభం

... మిగతా 6వ పేజీలో

రీచార్జి పిట్‌లు వినియోగించాలి

నగరంలో జనాభా పెరగడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. దీనికితోడుగా కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో వర్షం నీరు భూమిలోకి ఇంకే పరిస్థితులు క్షీణిస్తున్నాయి. జీవీఎంసీ సరఫరాచేసే నీటికి అదనంగా భూగర్భజలాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినియోగానికి తగినట్టుగా నీరు భూమిలోకి ఇంకిపోవాలి. దీనికి అనుగుణంగా ప్రతి ఇంటి వద్ద రీచార్జి పిట్‌లు నిర్మించాలి. రాష్ట్రంలో భూగర్భజల మట్టం సగటున మూడు నుంచి ఎనిమిది మీటర్ల మధ్యన ఉండాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దయించారు. ఈ మేరకు జిల్లాలో రీచార్జి పిట్‌ల ఏర్పాటు, నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

- బీఎస్ఎస్ఎన్ మూర్తి, జిల్లా భూగర్భ జలశాఖాధికారి

క్రీడా విభాగంపై మహా నిర్లక్ష్యం

ఏడాదిన్నరగా స్పోర్ట్స్ డైరెక్టర్ పోస్టు ఖాళీ

ఇన్‌చార్జిగా వర్క్ ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగికి బాధ్యతలు

- జీవీఎంసీ ఆధీనంలో విలువైన స్టేడియం, మైదానాలు
- మరమ్మతుల పేరుతో ఏళ్లుగా సాగుతున్న పనులు
- నిలిచిపోయిన సమ్మర్‌క్యాంప్‌లు, క్రీడాశిక్షణ శిబిరాలు
- పిల్లల్లో క్రీడల పట్ల కొరవడుతున్న ఆసక్తి

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగరపాలకసంస్థ (జీవీఎంసీ)లో అత్యంతకీలక క్రీడా విభాగంపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నా యి. గతంలో నిత్యం క్రీడాపోటీలు, పిల్లలకు శిక్షణ శిబిరాలు, డిపార్టుమెంట్ గేమ్స్, కార్పొరేటర్లకు క్రీడాపోటీలతో నిత్యం సందడిగా ఉండే క్రీడా విభాగం ఇప్పుడు స్తబ్దుగా మారిపోయింది. ఆ విభాగాన్ని కమిషనర్ ఆదేశాల మేరకు నడిపించే డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. వర్క్ ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో నగరంలో క్రీడాభివృద్ధికి, పిల్లల్లో క్రీడలపట్ల ఆసక్తి పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం

నగరంలో పిల్లలకు క్రీడలపట్ల ఆసక్తిపెంచడంతో పాటు క్రీడల్లో నైపుణ్యం కలిగినవారికి మరింత ఉన్నత మైన శిక్షణ ఇచ్చి ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ ప్రత్యేకంగా క్రీడావిభాగాన్ని ఏర్పాటుచేసింది. నగరంలోని కీలకప్రాంతాల్లో రూ.కోట్లు ఖర్చుపెట్టి స్టేడియంలు, ఇండోర్ స్టేడియంలు, మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను నిర్మించింది. ఆయా చోట్ల నగరవాసులు, యువత, వర్ధమాన క్రీడాకారులు సాధన చేయడం, శిక్షణ పొందడంతోపాటు వ్యాయామం చేసుకునే సదుపా యాలను కల్పించింది. కొన్నిచోట్ల నామమాత్రపు రుసుముతో, మిగిలిన చోట ఉచితంగానే ప్రవేశం కల్పిస్తున్నారు. క్రీడలపట్ల ఆసక్తి కలిగిన చిన్నారులను ప్రైవేటు అకాడమీలు, కోచింగ్‌సెంటర్లలో చేర్పితే భారీగా ఫీజులు చెల్లించాలి. ఇది సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారం. అలాంటివారికి జీవీఎంసీ పరిధిలోని స్టేడియంలు, మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో నామమాత్రపు ఫీజుతో నిపుణులైన కోచ్‌లు శిక్షణ ఇచ్చేవారు. అయితే జీవీఎంసీకి ప్రత్యక్షంగా కోచ్‌లు లేకపోవడంతో కరాటే, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, స్విమ్మింగ్, కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించడం, తరచూ క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేవారు. ఫలితంగా మిగిలిన చిన్నారుల్లో క్రీడలపట్ల ఆసక్తి పెరిగేది.

జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో సమ్మర్‌స్పోర్ట్స్ పేరుతో అనేక క్రీడాంశాల్లో తర్ఫీదు ఇవ్వడం, స్నాక్స్, పౌష్టికాహారం అందించడం, క్రీడాపరికరాలు, సామగ్రిని సమకూర్చేవారు. జీవీఎంసీ ఉద్యోగుల్లో స్నేహభావంతో పాటు పనిఒత్తిడి నుంచి ఉపశమనం లభించేలా ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తుంటారు. కార్పొరేటర్లకు కూడా ఈ పోటీలు జరిగేవి. ఈ నేపథ్యంలో జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారిని స్పోర్ట్‌డైరెక్టర్‌గా నియమించి నగరంలో క్రీడాభివృద్ధికి జీవీఎంసీ కృషిచేసింది.

అయితే స్పోర్ట్స్ డైరెక్టర్‌గా పనిచేసిన వై.శ్రీనివాసరావు ను ప్రభుత్వం ఏడాదిన్నర కిందట బదిలీచేసింది. ఆ స్థానంలో ఎవరినీ నియమించకుండా, వర్క్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. అతని ప్రతిపాదనలు, సూచనలను ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం, చిరుద్యోగి కావడంతో క్రీడావిభాగంలోని సమస్యలను

... మిగతా 6వ పేజీలో


గంటాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఘనంగా గంటా బర్త్‌డే

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఇతర ప్రజా ప్రతినిధులు, అభిమానులు, టీడీపీ కార్యకర్తలు గంటాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంటా బదిర విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కాగా సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సినీ నటులు మురళీమోహన్, సాయికుమార్, నిర్మాతలు అల్లు అరవింద్, బండ్ల గణేశ్, నటులు శ్రీకాంత్, శివాజీ రాజా, ఆలీ, తదితరులు బర్త్‌డే విషెస్ తెలిపారు.

శత శాతం ధ్యేయం

సంపూర్ణ అక్షరాస్యత దిశగా కార్యాచరణ

- 2029 నాటికి సాధించడమే లక్ష్యం
- 2011 జనాభా లెక్కల మేరకు 66.91 శాతం అక్షరాస్యత
- ఉమ్మడి జిల్లాలో మొత్తం నిరక్షరాస్యులు : ఆరు లక్షలు
- తొలివిడతలో 2.53 లక్షల మందిని తీర్చిదిద్దాలని కంకణం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి 2026-27 వరకు మూడేళ్లలో నిరక్షరాస్యుల్లో మూడింట ఒక వంతు మందిని అక్షరాస్యులుగా మార్చాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసిన అధికారులు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు నేర్పించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2011 జనాభా లెక్కల మేరకు అక్షరాస్యత 66.91 శాతం (పురుషులు 74.56, మహిళలు 59.34 శాతం)గా నమోదయింది. కొత్త జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పురుషులు, మహిళలు 84.81 శాతం, 73.21 శాతం (మొత్తం 79.05 శాతం), అనకాపల్లిలో 68.90, 52.43 (మొత్తం 60.55 శాతం), అల్లూరి జిల్లాలో 57.60, 39.53 (48.34 శాతం) అక్షరాస్యులున్నారు. ఆ తరువాత కాలంలో అక్షరాస్యత శాతం పెరిగింది. పదేళ్ల క్రితం సంక్షేమ కార్యక్రమాల అమలుకోసం చేపట్టిన సర్వే ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది నిరక్షరాస్యులు ఉంటారని అంచనా వేశారు. ఇందులో తొలివిడతలో మొత్తం 2,53,915 మంది (విశాఖ జిల్లాలో 78,676 మంది, అనకాపల్లిలో 89,944, అల్లూరి జిల్లాలో 85,284)ని అక్షరాస్యులను చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం కూలీలు, డ్వాక్రా సంఘాల సభ్యులను

... మిగతా 6వ పేజీలో


చదువుకుంటున్న నిరక్షరాస్యులు

నేవీ డే లేనట్టే!

- ఈసారి సాహస విన్యాసాలకు దూరం
- ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్, మిలాన్‌ల నేపథ్యంలో రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేవీ డే సందర్భంగా తూర్పు నౌకాదళం ప్రతి ఏటా డిసెంబరు 4వ తేదీ సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో నిర్వహించే సాహస విన్యాసాల ప్రదర్శన ఈ ఏడాది కనిపించే అవకాశం లేదు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు, రిహార్సల్స్ పూర్తయ్యేవి. విశాఖ గగన వీధుల్లో యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాల్సిన సమయం. కానీ ఈసారి వాటి జాడ లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026ను భారీఎత్తున నిర్వహించడానికి నేవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారత రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, తదితర ప్రముఖులు హాజరవుతారు. ఇందులో సుమారు 50 దేశాలకు పైగా పాల్గొంటాయి. ఇవి అతి పెద్ద కార్యక్రమాలు కావడం, అప్పుడు కూడా ఆర్‌కే బీచ్‌లో నేవీ సాహస విన్యాసాలు నిర్వహించాల్సి ఉండడంతో తాజాగా నేవీ డే నిర్వహించడం లేదని తెలిసింది. గత ఏడాది ఒడిశాలోని పూరి తీరంలో నేవీ డే నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తరువాత జనవరి 4న విశాఖలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు.



ఉక్కు ప్రమాదంపై ఫోరెన్సిక్ తనిఖీలు

- కారణాల వెలికితీతకు కమిటీ ఏర్పాటు
- స్టీల్‌ప్లాంటులో మరిన్ని సీసీ టీవీ కెమెరాలు
- ఉద్యోగులకు ఒరిజనల్ ఐడీ కార్డు ఉంటేనే ప్రవేశం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్‌కు రా మెటీరియల్ సరఫరా చేసే కన్వేయర్ బెల్ట్ తెగిపోయిన ఘటనపై విశాఖపట్నం సిటీ పోలీసులు సోమవారం ఫోరెన్సిక్ నిపుణులతో వెళ్లి పరిశోధన చేశారు. బెల్ట్ తెగిపోవడానికి అసలైన కారణాలు ఏమిటో గుర్తించడానికి అందుబాటులో ఉన్న అన్నిరకాల సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటామని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు.


కన్వేయర్ బెల్ట్ తెగిపోవడంతో ఊడిపోయిన రోలర్ (ఫైల్ ఫొటో)

ఇటీవల స్టీల్‌ప్లాంటులో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో కన్వేయర్ బెల్ట్‌లు తరచూ తెగిపోతున్న సంగతి తెలిసిందే. ఉద్యోగులే కావాలని వాటిని కోసేస్తున్నారని యాజమాన్యం అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో నవంబరు 25న బీఎఫ్-3కి ముడి పదార్థాలు సరఫరా చేసే ఎంబీ-2 కన్వేయర్ బెల్టు తెగిపోయింది. దీనివల్ల ఆ బీఎఫ్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న యాజమాన్యం 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీస్ కమిషనర్ విచారణకు వెళ్లారు. అప్పుడు ప్లాంటు పర్యటనలో ఉన్న స్టీల్ జాయింట్ సెక్రటరీలు, సీఎండీ సక్సేనాతో కలసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. కన్వేయర్ బెల్ట్‌లకు, వాటివల్ల ప్లాంటుకు జరుగుతున్న నష్టంపై సీఎండీ సక్సేనా ప్రత్యేక కమిటీ వేశారు. వారిని సమన్వయం చేసుకుంటూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు పర్యవేక్షణ

ప్లాంటులో చాలాచోట్ల సీసీ టీవీ కెమెరాలున్నాయి. కన్వేయర్ బెల్ట్‌లు

... మిగతా 6వ పేజీలో


పారాయణలు చేస్తున్న అధ్యాపకులు

అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో విశిష్టాద్వైత మత ప్రచారకులు తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. సోమవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను, ఆళ్వార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. షోడశోపచార పూజలు తరువాత ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను పారాయణం చేశారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి


తిరువీధిలో పల్లకీపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో ఏకాదశి పూజలు, తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అంతరాలయంలో లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు.స్వామివారికి షోడశోపచారాలు సమర్పించిన అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రాల నడుమ తిరువీధి ఉత్సవం జరిపారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారదా ప్రియాంక

ఆనందపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పల్లెల్లో మౌలిక సదుపాయల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ ఎటువంటి నిర్మాణాలు జరగలేదని, లబ్ధిదారులు నిర్మాణాలు చేయడానికి సిద్ధంగా ఉన్నా..అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అలాగే రీ సర్వే జరిగిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల పూర్తిస్థాయిలో వేయలేదని వేములవలస పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు నాగరాజు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్, వైద్య, వ్యవసాయ, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖలకు సంబంధించిన అంశాలను కూడా సభ్యులు ప్రస్తావించారు.సమావేశంలో శొంఠ్యాం పీఏసీఎస్ అధ్యక్షుడు గండ్రెడ్డి స్వామినాయుడు, తర్లువాడ సర్పంచ్ నాయుడు,వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు శిర్లపాలెం బాలిక



ఆనందపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రేగాని శృతిక జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం శారద, పీడీ బుత్తల సత్యం తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లిలో గత 28 నుంచి 30 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జట్టులోని 12 మంది క్రీడాకారుల్లో శృతిక కూడా ఉంది. శృతిక, సారిక పవిత్ర, ఎర్ర హరణి, శిర్ల చైత్రవర్షిని పోటీల్లో ప్రతిభ చూపడంతో వారిని వచ్చేనెల 16 నుంచి రాజస్థాన్‌లో జరిగే 69వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ఎంపిక చేశారు. ఈ జట్టుకు శృతిక కెప్టెన్‌గా ఎంపికైనట్టు పీడి తెలిపారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

తగరపువలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో భీమిలి ఏరియా కార్యదర్శి కె. రాంబాబు అధ్యక్షతన వారు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్లు తప్ప కొత్తగా మంజూరు చేయడం లేదన్నారు. ఎంతోమంది అర్హులు దరఖాస్తు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, కానీ అధికారులు తీసుకోవడం లేదని తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, మావూరి సన్యాసమ్మ, పల్లి లక్ష్మణరావు, మామిడి సన్యాసిరావు, నూలు అదినారాయణ, చిల్ల అప్పలసూరి, ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, రామ పైడయ్య, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత బుల్లయ్య కళాశాల

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏయూ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నీలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ చాంపియన్‌గా నిలిచింది. సోమవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో బుల్లయ్య కాలేజి 2-1 గోల్స్ తేడాతో ఏయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్‌పై గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకున్నది. ఏయూ రెక్టార్ ఆచార్య పి. కింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ ఎ. పల్లవి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు.


జోడుగుళ్లపాలెంలో లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి


సాగర్‌నగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

క్రమం తప్పకుండా పింఛన్లు

- ఆర్థిక ఇబ్బందులున్నా.. సకాలంలో అందిస్తున్నాం
- అర్హులందరికీ మంజూరు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- జోడుగుళ్లపాలెంలో పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా పింఛన్లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన 8వ వార్డు సాగర్‌నగర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పింఛన్ రాకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అంతకముందు కాలనీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాగా గంటా పుట్టినరోజు పురస్కరించుకుని అక్షయ పాత్ర అందించిన భోజనాలను విద్యార్థులకు వడ్డించారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి సన్యాసిరావు, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్, చెట్టుపల్లి గోపి, నాయకులు చిక్కాల విజయ్‌బాబు ,దొరబాబు, మంగాదేవి, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో...

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో డయాలిసిస్ రోగి మారుపిల్లి పోలయ్యకు మంజూరైన పింఛన్‌ను ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు ఇచ్చే ఘనత తమ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వెజెళ్ల సుబ్బరాజు, నాయకులు అక్కుబోయిన రాంబాబు, గోవింద్, నూకరాజు, చిన్నారావు, సుజాత పాల్గొన్నారు.

మధురవాడలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు కాలనీల్లో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ పింఛన్లు పంపిణీ చేశారు. పిలకవానిపాలెం, పాత మధురవాడ, వాంబేకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ ప్రాంతాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆమె పింఛన్ నగదు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు అందించడమే తమ ప్రభుత్వం లక్ష్యమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డులోని పలు ప్రాంతాల్లో ఆమె సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి అనిత పాల్గొన్నారు.

భీమిలిలో 93.94 శాతం పంపిణీ

భీమునిపట్నం : భీమిలిలో పింఛన్లు 93.94 శాతం పంపిణీ చేశామని జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఉదయం ఆరున్నర నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జోన్‌లో మొత్తం 8527 మంది పింఛన్‌దారులుండగా మొత్తం రూ. 3,69,04,500 ఇవ్వాల్సి ఉంది. సాయంత్రానికి 8010 మందికి రూ. 3.45 కోట్లు బట్వాడా చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ దొర, జోనల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో కార్పొరేటర్ పిసిని వరాహనరసింహం సారథ్యంలో 95 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయింది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఇన్‌చార్జిలు బూర్లె కనకారావు, కంది వేణు, నవగాని కిశోర్ పాల్గొన్నారు.

కృష్ణాపురంలో...

పద్మనాభం : కృష్ణాపురంలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ పాల్గొన్నారు. పలువురు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసిన ఆయన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గంటా జన్మదిన వేడుకలు


భీమిలి సీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న గంటా రవితేజ


ఎమ్మెల్యే గంటాకు అప్పన్న ఫొటో బహూకరిస్తున్న ఈఓ సుజాత, వేద పండితులు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామల్లోనూ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 3వ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోశాధికారి గొలగాని నరేంద్రకుమార్, కనకల అప్పలనాయుడు, కంచర్ల కామేశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. టీడీపీ నాయకుడు ఆవాల సూరిబాబు సమకూర్చిన దుస్తులను ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఫణికుమార్‌ను ఆస్పత్రి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిగా ఉన్న సీహెచ్‌సీని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తే మరింత మంది రోగులకు సేవలందించవచ్చని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని రవితేజ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వియ్యపు పోతురాజు, శీరం మహేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలరు అర్థపాక గురునాథ్, కాసరపు ఎల్లాజీ, గండిబోయిన పోలిరాజు, గాడు ఆనంద్, నక్కిళ్ల వెంకటరావు, మైనారిటీ నాయకులు షేక్ అన్వర్ పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వీట్లు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాగా ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో నాయకులు బీఆర్‌బీ నాయుడు, తాత్రాజు అప్పారావు,గండ్రెడ్డి స్వామినాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, కాకర వెంకటరమణ, మదపాడ శ్రీను,లోకిరెడ్డి అచ్చిబాబు, పాండ్రంకి అప్పలరాజు, కొట్యాడ లక్ష్మణమూర్తి, లంక నర్సంగరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ఎండాడ : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకుని ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న ట్రిబుల్ ఆర్ సెంటర్ ఆవరణలో టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపీ ఆధ్వర్యంలో ఆ వార్డు పరిధిలోని శానిటరీ సిబ్బందికి సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత గోపీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, పరమేశ్వరరావు, అప్పలరాజు, శానిటరీ సూపర్‌వైజర్ జగదీశ్ పాల్గొన్నారు.

కొమ్మాదిలో..

కొమ్మాది : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినం వేడుకలను ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా మధురవాడలోని అంధుల పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు మన్యాల సోంబాబు, లొడగల జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పండితుల వేదాశీర్వచనాలు

సింహాచలం : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినం పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం పండితులు ఆయనకు వేదాశీర్వచనాలిచ్చారు. ఎంవీపీ కాలనీలోని గంటా నివాసానికి దేవస్థానం ఈఓ ఎన్. సుజాతతో కలిసి వెళ్లిన పండితులు తొలుత ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితుడు కపిలవాయ్ అగ్నిరామ్‌కుమార్ చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీస్సులీయగా, ఈఓ శాలువతో సత్కరించి ప్రసాదాలు ఇచ్చారు.

పద్మనాభంలో..

పద్మనాభం రూరల్ : ఎమ్మెల్యే గంటాకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నగరంలోని ఆయన నివాసానికి తరలివెళ్లారు.గంటాను కలిసిన వారిలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్లెపాటి పెద ఎర్నినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రమణ, కేవీ సత్యనారాయణ, మొకర అప్పలనాయుడు, వెంకటరావు, గెద్ద ప్రసాద్ ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ


మధురవాడలో గాయత్రి విద్యా పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ


భీమిలిలోని గంట స్తంభం వైద్యులు, సిబ్బంది నినాదాలు

తగరపువలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీవాణి మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి డా. బి. స్వర్ణలత, అధ్యాపకులు సౌజన్య, సుదాంన, ప్రభాకర్, విజయలక్ష్మి, సీతంనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి మెయిన్ రోడ్ మీదుగా గంట స్తంభం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలరు వి. శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ పి. రామ్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కూడా ఎయిడ్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



తగరపువలసలో ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

మధురవాడ : వాంబే కాలనీలో గాయత్రి విద్యా పరిషత్ కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, ఐసీటీసీ ఏఆర్‌టీ సెంటర్ల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ న్విహించారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీపీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ సురేశ్, డాక్టర్ రవికిరణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏవీ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.


పోషకాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

విద్యార్థులకు పోషకాహారం

సాగర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న వాడపాలెం హైస్కూల్, ఎండాడ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సాగర్‌నగర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న పోషకాహార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట పోషకాహారం అందించాలన్న ఆలోచన అభినందనీయమన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ జనరల్ మేనేజర్ అంబరీష దాస మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో చాలామంది ఉదయం అల్పాహారం తినకుండా రావడం గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. తొలుత మూడు రోజుల పాటు ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విభాగంపై 'మహా' నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే సాహసం చేయలేకపోవడంతో క్రీడా రంగం కుదేలయింది. గత ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించలేదు. ఉద్యోగులకు, కార్పొరేటర్లకు ఆటలపోటీలు జరగలేదు. ఏడాదిన్నరలో జీవీఎంసీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

12 చోట్ల క్రీడా ప్రాంగణాలు

జీవీఎంసీకి 12 చోట్ల క్రీడా ప్రాంగణాలున్నాయి. భీమిలి మునిసిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలు ఉన్నాయి. జోన్-3 పరిధిలో రేసపువానిపాలెం వద్ద స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, పెదవాల్తేరు రైతుబజార్ వెనుక లాన్‌టెన్నిస్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, వన్‌టౌన్‌లో ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం, గాజువాక వికాస్ నగర్‌లో రాజీవ్ ఇండోర్ క్రీడా ప్రాంగణం, శ్రీహరిపురం కోరమండల్‌గేట్ ఎదురుగా అవుట్‌డోర్ క్రీడాప్రాంగణం, అనకాపల్లిలో ఎన్టీఆర్ అవుట్‌డోర్ స్టేడియం, రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియం , ఆర్కేబీచ్ వద్ద జీవీఎంసీ ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎంవీపీకాలనీలో స్మార్ట్‌సిటీకింద నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా ఉన్నాయి. వీటి నిర్వహణకు ఉద్యోగులు, వసతులు ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులపై స్వార్థం, వారిపై వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి కీలకమైన ఎంవీపీకాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా, బీచ్‌రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రైవేటుకు అప్పగించేయడంతో సామాన్యులు శిక్షణ పొందలేని పరిస్థితి ఏర్పడింది. స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం, గాజువాక వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ క్రీడా ప్రాంగణం, భీమిలిలోని మునిసిపల్ ఇండోర్‌స్టేడియం ఏళ్లుగా ఆధునికీకరణ పేరుతో మరమ్మతులు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కమిషనర్ కేతన్‌గార్గ్ స్వర్ణభారతి పనులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజుల్లో పూర్తి చేయాల్సిందేనని స్పష్టంచేశారు.

శత శాతం ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అక్షరాస్యులను చేయడం ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆడియో, వీడియో పాఠాలతోపాటు రాయడం, చదవడం, చిన్నచిన్న కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యక శాస్త్రం, జీవ, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కార్యక్రమాలు అమలుచేస్తారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిరక్షరాస్యులకు ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో విశాఖ జిల్లాలోనూ నిర్వహిస్తామని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో నిరక్షరాస్యులకు వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, చిన్నపాటి కూడికలు, తీసివేతలు, సంతకం నేర్పుతున్నామన్నారు. ఒక వాచకం కూడా అందజేశామన్నారు.

నగరానికి మణిహారం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటన్నింటితో విశాఖకు పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కైలాసగిరిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఈఈ మధుసూదనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రమాదంపై ఫోరెన్సిక్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

తెగిపోతుండడంతో ప్రత్యేక విభాగాల్లో మరిన్ని సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. దాంతో యాజమాన్యం ఏర్పాట్లలో నిమగ్నమైంది. అంతేకాకుండా ప్లాంటులో విధులకు వచ్చే ప్రతి ఒక్కరు యాజమాన్యం జారీ చేసిన ఐడీ కార్డును(ఒరిజినల్) ధరించాలని ఆదేశించింది. కొందరు కలర్ జెరాక్స్ కాపీలు లామినేషన్ చేయించి వినియోగిస్తున్నారని, వాటిని అనుమతించమని స్పష్టంచేసింది.

జలం.. పుష్కలం

... 5వ పేజీ తరువాయి

మండలం పాండ్రంకిలో 5.33 మీటర్ల నుంచి 3.26 మీటర్లకు, విశాఖ ఉక్కు కర్మాగార ప్రాంతంలో 4.08 మీటర్ల నుంచి 3.43 మీటర్లకు చేరుకుంది. పెందుర్తిలో 6.76 మీటర్ల నుంచి 3.94 మీటర్లు, మారికవలసలో 9.71 నుంచి 7.62, మధురవాడలో 11.63 నుంచి 10.51 మీటర్లు పైకి వచ్చింది. కాగా ఎండాడలో 12.73 మీటర్ల నుంచి 13.91 మీటర్లకు, గాజువాక కణితికాలనీలో 10.38 నుంచి 11.8 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవలో 15.06మీటర్ల నుంచి 14.1 మీటర్లకు, సెంట్రల్ పార్కులో 12.5 నుంచి 11.05 మీటర్లకు తగ్గినా నీటి వినియోగంపై ఒత్తిడి కొనసాగుతోంది.

ఇళ్లపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పుపై సౌరశక్తి పలకల ఏర్పాటు కోసం ఏపీఈపీడీసీఎల్ సంస్థ సద్భవ్ ఫ్యూచర్‌టెక్ లిమిటెడ్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, డైరెక్టర్ ఆపరేషన్స్ టీవీ సూర్య ప్రకాష్ ల సమక్షంలో కార్పొరేట్ కార్యాలయంలో సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద నర్సీపట్నం, పాలకొండ, పెద్దాపురం, రామచంద్రపురం, టెక్కలి, విజయనగరం రూరల్, తాడేపల్లిగూడెం డివిజన్లలోని 44,998 ఎస్సీ, ఎస్టీల సర్వీసులకు మొత్తం 90 మెగావాట్ల సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సోలార్

పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని సుమారు 2 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రతి వినియోగదారుని ఇంటి మీద 200 చదరపు అడుగుల ప్రాంతంలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.


ఆక్రమిత స్థలంలో నిర్మాణం

పశుసంవర్ధక శాఖ స్థలాల ఆక్రమణ

ఆరిలోవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 12వ వార్డు పార్వతీనగర్‌లో పశు సంవర్ధకశాఖ స్థలాలను కొందరు ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయల విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ శాఖ డిప్యూటీ డైరక్టర్ నీలయ్య దృష్టికి ఆక్రమణల విషయం తీసుకెళ్లగా ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయించి ఖాళీ చేయిస్తామన్నారు.

ఆన్‌లైన్‌లో టికెట్ తీసుకుంటే శీఘ్రదర్శనం

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం ఆన్ లైన్‌లో టికెట్లు పొందిన భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించనున్నట్టు ఈఓ ఎన్. సుజాత తెలిపారు. ఈమేరకు సింహగిరిపై ఆలయ పరిసరాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సోమవారం ఆమె దేవస్థానం ఈఈ వెంకట రమణ, ఇతర అధికారులతో కలిసి క్యూలైన్ల పను లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు భక్తులకు ఆన్ లైన్ సేవల టికెట్లు, దర్శనం, వసతుల టికెట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఏఈ రవి రాజ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

భీమునిపట్నం,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీ స్టేడియంలో ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్, త్రోబాల్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఎంఈఓ శివరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి భీమిలి నుంచి పురుష ఉపాధ్యాయులకు ఎంపికలు నిర్వహించారు. అలాగే మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి, జోనల్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.

రికార్డులు లేని బైక్‌లు సీజ్

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రాంతాలతో పాటు బాలాజీనగర్, బైపాస్ రోడ్డులో భీమిలి పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీపీ ఆదేశాల మేరకు సీఐ బి. తిరుమలరావు, ఎస్ఐ భరత్‌కుమార్, ట్రైనీ ఎస్ఐ భవ్య, హెచ్‌సీ అప్పలరాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్రాలు లేని ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 బీరు సీసాలు, 4 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ).
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిను / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 60, గుత్తి/రవి వంకాయలు 60, బెండకాయలు 56, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 60, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, చిక్కుడు 56, దోస కాయలు 22, పొటల్స్ 52, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35,బీట్‌రూట్ 42, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన 5, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	630
విజయనగరం	634
శ్రీకాకుళం	634

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

తీరంలో సౌకర్యాల కొరత..సందర్శకుల కలత

- ఆర్‌కే బీచ్ వద్ద అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ
- కొన్నిచోట్ల నిరుపయోగం
- ఉన్నచోట సదుపాయాలు కరువు



బీచ్ వద్ద అధ్వానంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లు



అపరిశుభ్రతగా నిర్వహణ

బీచ్ రోడ్డు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకుల తాకిడితో కిటకిటలాడే సముద్ర తీరం వద్ద ప్రజా మరుగుదొడ్లు దుర్భరంగా మారాయి. కనీస వసతుల్లేక సందర్శకులు సతమతమవుతున్నారు. మరుగుదొడ్లలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. జీవీఎంసీ నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గతంలో లక్షలాది రూపాయలు వీటికోసం వెచ్చించారు. సరైన నిర్వహణ లేక మూతపడ్డాయి. దీంతో స్థానికులు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. బీచ్ రోడ్డు వద్ద పిల్లల మరుగుదొడ్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. టాయిలెట్‌కు వెళ్తే 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ధరల పట్టిక కనిపించకుండా దుప్పటితో కట్టి మూసేశారు. ఇక్కడి పరిస్థితి చూసి సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ మరుగుదొడ్లను గుత్తేదారులకు అప్పజెప్పడం వల్ల వారు తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతో దూర ప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- నిర్వహణ ఏది ?

బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకండి ... మరుగుదొడ్లను వాడండి .... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి అని ప్రతి సమావేశాల్లో హితోక్తులు చెప్పే అధికారులు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో తీర ప్రాంతానికి వచ్చే సందర్శకులు కనీసం మూత్ర విసర్జనకు కూడా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను మరమ్మతులు చేయించడంతో పాటు నిర్వహణపై దృష్టిపెట్టి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నాసిరకం కోక్ వినియోగంపై విచారణ జరపాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తార స్థాయికి చేరుకున్న అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నాసిరకం కోక్ వాడుతున్నారని, దీని వల్ల నాణ్యత లేని స్టీల్ ఉత్పత్తి అవుతుండడంతో కొనుగోలుదారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. కేంద్రం కావాలనే ఇలాంటి తప్పుడు విధానాలకు పాల్పడుతోందని, విశాఖ ఉక్కు నాణ్యతలో బ్రాండ్ విలువను చెడగొట్టాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాసిరకం ఇనుప ఖనిజం కోక్ వినియోగించటంపై సీబీఐకి ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో ఆయనతో పాటు నాయకులు జగ్గునాయుడు, కుమార్ ఉన్నారు.

హనుమత్ వ్రతానికి శ్రీకారం

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ వ్రతానికి సోమవారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఏటా మార్గశిర మాస శుక్లపక్ష దశమి నుంచి త్రయోదశి వరకు హనుమత్ వ్రతాన్ని నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ఈమేరకు ఆలయ అర్చకుడు రమేశ్ సారథ్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసి రుత్విక్ వరణలు ఇచ్చారు. తరువాత పండితులు రామాయణంలోని సుందరీ కాండ పారాయణను ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అర్చకులు ఆంజనేయస్వామికి విశేష పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చారు.

కాలి నడకన కాశీ యాత్రకు భక్తులు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం అర్చకుడు పుల్లేటికుర్తి ఆంజనేయశర్మ కాలినడకన కాశీ యాత్రకు సోమవారం ప్రయాణమయ్యారు. స్థానిక శివ, కేశవ ఆలయ ఆవరణలో ఆలయాల సముదాయం సింగిల్ ట్రస్టీ రొంపిచెర్ల సింగరాచార్యుల ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించి యాత్రకు సాగనంపారు. ఈ సందర్భంగా ఆంజనేయ శర్మ మాట్లాడుతూ జనవరిలో మొదటిసారిగా కాలినడకన కాశీ యాత్రకు వెళ్లి ఫిబ్రవరిలో వచ్చానని తెలిపారు. ఆయనతో పాటు పట్టణానికి చెందిన రాజేష్, జి. లక్ష్మి, నర్సీపట్నంకు చెందిన దింతుకుర్తి స్వర్ణ నాగేశ్వర రావు, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామ ఆయుర్వేద వైద్యుడు వెంకటరమణ కూడా కాశీ యాత్రకు బయలుదేరారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు అందాయని జడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆయన వినతులు స్వీకరించారు. 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వార్డులోని తాగునీటి సమస్య, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు గురించి వినతిపత్రం అందించారు. 2వ వార్డు వైసీపీ ఇన్‌ఛార్జి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ వార్డు నాయకులు ప్రజా సమస్యలను వివరించారు.

అలరించిన భక్తి గీతాలాపనలు

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నీరాజనం కార్యక్రమం సోమవారం రాత్రి సింహగిరిపై నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు కొమాండూరి వెంకట కృష్ణ తన గాత్ర మాధుర్యంతో ఆలపించిన గీతాలు భక్తులను అలరించాయి. మవుడూరి సత్యనారాయణశర్మ వయోలిన్‌పై, కమలాకర్ యోగేష్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. కచేరీ తరువాత దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ తిరుమలేశ్వరరావు వారిని ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు.

తీర ప్రాంతాల్లో వణికిస్తున్న చలి

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం నేపథ్యంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. చల్లని గాలులకు ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం నుంచీ చల్లని గాలులు వీస్తున్నాయి. ప్రతిరోజూ పర్యాటకులతో సందడిగా ఉన్న భీమిలి, సాగర్‌నగర్, తదితర తీర ప్రాంతాలు ఎవరూ లేక వెలవెలబోయాయి.

మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎండాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫేస్ బుక్‌లో తనకు తెలిసిన వాళ్ల వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్న ఫొటోలను డౌన్లోడ్ చేసుకుని వాటిని అసభ్యకరమైన ఫొటోలుగా మార్ఫింగ్ చేసి మహిళను వేధిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన మహిళకు ఫేస్‌బుక్ అకౌంట్‌లో తెలియని వ్యక్తి అసభ్యకరమైన మెసేజ్‌లతో పాటు ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టు చేసి, వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి కాకినాడ జిల్లాకు చెందిన తాటికాయల దివాకర మారుతి సత్యతేజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


వస్త్ర ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో స్టాల్స్ నిర్వాహకులతో కలిసి పాల్గొన్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల, తదితరులు

హోటల్ గ్రీన్ పార్కులో చేనేత వస్త్ర ప్రదర్శన

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటల్ గ్రీన్ పార్కులో సోమవారం చేనేత వస్త్ర సముదాయం 'వసంతం' పేరుతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధునాతన చేనేత వస్త్ర ప్రదర్శనను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు వారు స్వయంగా తయారు చేసిన వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 64 స్టాల్స్‌లో కలంకారి, బాందిని, గుజరాతి, అస్సాం చేనేత వస్త్రాలతో పాటు ఏటికొప్పాకకు చెందిన పలు రకాల బొమ్మలను ప్రదర్శనలో ఉంచారు. మంగళవారం కూడా ఈ ప్రదర్శన కొనసాగుతుంది.


ఎంపీపీ కాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న మేయర్ పీలా, పక్కన ఎమ్మెల్యే వెలగపూడి

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణి, గొలగాని పోలారావు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ పరిధికి చెందిన 13వ వార్డులోని పలు ప్రాంతాలలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది కలసి సోమవారం ఉదయం ఇళ్ల వద్ద పంపిణీ చేశారు. వార్డులోని దీనదయాళపురం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, సాయినగర్, విష్ణుపురకాలనీ, ఎర్ని దుర్గానగర్, ఏఎస్ఆర్ నగర్, శివాజీ పాలెం, ఏఎస్ఆర్‌నగర్, సిద్దార్థ బీసీ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలలో పింఛన్లు అందించారు. సీనియర్ నాయకులు పి., ధర్మారావు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15వ వార్డులో..

వెంకోజీపాలెం : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో నూతనంగా విడుదలైన స్పౌజ్ పింఛన్లను వార్డు కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్, ఇతర నాయకులు అందజేశారు. భర్త పెన్షన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు పెన్షన్‌లు మంజూరు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రిబ్బన్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

మద్దిలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన సాధ్యమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చెప్పారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిలో 15 నుంచి 49 ఏళ్ల మధ్యలో ఉన్న వారే 90 శాతం ఉంటున్నారన్నారు. అవగాహన లేకపోవడం, లైంగిక సంబంధాల వలనే యువత హెచ్ఐవీ బారినపడుతున్నారన్నారు. అందుకే విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, రెడ్‌రిబ్బన్, రెడ్‌క్రాస్, ఉన్నత అభియాన్ ప్రతినిధులు సాయికృష్ణ, టి.రామకృష్ణ, ఎస్.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : అంబేడ్కర్ గురుకులం నుంచి శ్రీకృష్ణాపురం వరకు ఎయిడ్స్ వ్యాధి ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీని నిర్మూలన అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలని నినదించారు.

పంచాయతీరాజ్ శాఖాధికారులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న ఉన్నతాధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐఐఎం విశాఖపట్నం ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఉన్నతాధికారులకు లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. 50 మందికి పైగా గెజిటెడ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ కమిషనర్ ముత్యాలరాజు రేవు, పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు, అడిషనల్ కమిషనర్ ఎం. సుధాకరరావు, ఐఐఎం డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

పక్కాగా వికలాంగుల హక్కుల చట్టం అమలు

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(వీసీఈఏ) విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'వికలాంగుల హక్కుల చట్టం 2016', 'ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల చట్టం రూల్స్ 2023' పుస్తకాల ఆవిష్కరణ సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తన కార్యాలయంలో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వికలాంగుల హక్కుల చట్టాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. వారి హక్కులను పరిరక్షించడంలో జిల్లా అధికారులంతా ముందుండాలని, చట్టాలను అమలు చేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం వీసీఈఏ విశాఖ జిల్లా శాఖకు ఒక మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రమేష్, వీసీఈఏ మహిళా కార్యదర్శి ధనలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్. జ్యోతి, కవిత, పలువురు ప్రతిభావంతులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వార్డు స్థాయి నుంచి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చెప్పారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో రూ.54 లక్షలతో రక్షణ గోడ, సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి వాడవాడలా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, అండర్ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నిత్యం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, కార్యదర్శి మళ్ల రవికుమార్, డొక్కర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ధర్నా


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినదిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టీ.నూకరాజు, ఉరికూటి రాజులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారులు తగిన రీతిలో స్పందించటం లేదన్నారు. ప్రజారోగ్యం, నీటి సరఫరా కార్మికుల తీర్మానాలు అమలు చేయని కారణంగా కొత్త సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే, నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి వివిధ సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

32 మంది నిరాశ్రయుల తరలింపు

డాబాగార్డెన్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచన మేరకు మిషన్ తమసోమా జ్యోతిర్గమయలో భాగంగా విశాఖ కంట్రోల్ రూం పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఒక మహిళ సహా మొత్తం 32 మంది నిరాశ్రయులను రెస్క్యూ చేసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ డే అండ్ నైట్ షెల్టర్, భీమ్‌నగర్‌లోని షెల్టర్‌కు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రప్పించి, బిక్షాటనకు ప్రోత్సహించవద్దని చెప్పి అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ సీఐ భాస్కరరావు, ఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కిరణ్‌ప్రతాప్, కేర్ టేకర్లు శాంతి,ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారని తెలిపారు.

విద్యుత్ లైన్లు మార్పు చేయాలి

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న వీధి లైట్లకు వైర్లు మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వీధి లైట్లకు తాటితూరు గ్రామ పొలాల మధ్య నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల పొలం మధ్యలో వైర్లు తెగిపోయినా.. మరమ్మతుకు గురైనా బాగుచేయడానికి ఇబ్బంది కలుగు తోంది. వైర్ల తెగితే గొల్లలపాలెం గ్రామానికి సరఫరా నిలిపివేసి పనులు చేపడుతున్నారు. దీనివల్ల గ్రామస్తులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామానికి వెళ్లే మట్టి రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటికి పొలాల మధ్య నుంచి వెళుతు న్న లైను ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. తాటితూరు ప్రధాన రహదారి నుంచి నగరపాలెం వెళ్లే రోడ్డు పక్కనున్న శివాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఈ విద్యుత్ లైను కలిపితే అక్కడి నుంచి నేరుగా వీధి లైట్లకు సరఫరా అందుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యర్థాల నిర్వహణపై వర్క్‌షాప్

సాగర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల్లో వ్యర్థాల నిర్మూలన, రక్షిత మంచినీటి సరఫరాకు కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత సర్క్యులర్ ఎకానమి అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిలో సర్క్యులర్ ఎకానమి అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బ్రిజేష్ కుమార్ దూబే మాట్లాడుతూ పట్టణాల నుంచి వెలువడే వ్యర్థాల్లో 60 శాతం ఆర్గానిక్ వ్యర్థాలు ఉన్నాయని తెలిపారు. సర్క్యులర్ ఎకానమి వ్యర్థాలను తగ్గించడానికి తిరిగి వాటిని ఏదో ఒక విధంగా ఉపయోగించడానికి నిర్దేశించిన ఆర్థిక వ్యవస్థ అని వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ అశ్వనీకుమార్ తివారీ మాట్లాడుతూ నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ ఏవిధంగా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో సౌదీ అరేబియా ప్రొఫెసర్ నబీసాబ్ ముబారక్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పరిశోధకుడు డాక్టర్ గణేశ్ కుమార్, ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ డి. ముకుంద్, వర్క్‌షాప్ కన్వీనర్లు సుభాష్‌చంద్ర, ఈశ్వరరావు పాల్గొన్నారు.

5న అంతర్ కళాశాలల ప్రతిభాపోటీలు


బ్రోచరు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 5న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. సోమవారం కళాశాలలో బ్రోచర్లు ఆవిష్కరించారు. విద్యార్థులలో భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ప్రతిభాపాటవాలు ప్రోత్సహించేందుకు ద్వితీయ భాషావిభాగం మూడు సంవత్సరాలుగా ఈ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కళాశాల విద్యార్థినులతో పాటు విశాఖపట్నంలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధిపతి డా.జె.నిర్మల, డా.దీప్తి, పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో ఏకాదశి పూజలు, తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అంతరాలయంలో లోకకల్యాణార్థం అన్న సంకల్పం తో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు.స్వామివారికి షోడశోపచారాలు సమర్పించిన అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రాల నడుమ తిరువీధి ఉత్సవం జరిపారు.

అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు

వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో విశిష్టాద్వైత మత ప్రచారకులు తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. సోమవా రం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను, ఆళ్వార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను పారాయణం చేశారు.

వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో 2026 సంవత్సరానికి కొత్త కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సిహెచ్.సత్యసూర్యవరప్రసాదరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, ఎస్.ప్రకాశరావులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.సత్యశ్రీరామ్, సహాయ కార్యదర్శిగా కె.వెంకటవర్మ, కోశాధికారిగా వీరబాబు, జాలి వాకర్‌గా కె.రాజారావులను క్లబ్ సభ్యులు ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నారు. వీరితో పాటు 9 మంది బోర్డ్ ఆఫ్ డైరక్టర్లుగా నియమితులయ్యారు. వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపకులు ఎస్.బుచ్చయ్య, కృష్ణప్రసాద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జనవరి నుంచి ఎన్నికైన కొత్త కార్యవర్గసభ్యులు బాధ్యతలు తీసుకుంటారని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. పార్కు మరింత పూర్తి స్థాయిలో ఉన్నతి చెందడానికి కొత్త కార్యవర్గసభ్యులు కృషిచేయాలని ఆకాంక్షిస్తు క్లబ్ మెంబర్లు కొత్త కమిటీ సభ్యులను అభినందించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఎన్నికకు వినతి

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ఏపీ స్పోర్ట్సు సెల్ చైర్మన్ జీవీఎస్ కమలాకర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. జగదాంబ జంక్షన్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రతినిధి సునీల్ అహ్రేన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పార్టీ పరిశీలకులు అమర్షహ బేబి, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

మురళీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ రోడ్డులోని బ్లాక్ నంబర్-15 వాటర్ పంప్‌హౌస్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో సోమవారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ పంప్‌హౌస్ నుంచి సరఫరా అయ్యే 46, 47, 48 వార్డుల్లోని నివాసిత ప్రాంతాలకు నీరందలేదు. పనుల కారణంగా తాత్కాలికంగా సరఫరాను ఆపేసినట్లు జీవీఎంసీ తాగునీటి విభాగం ఏఈ సుమన్ తెలిపారు. మంగళవారం నుంచి యథావిధిగా తాగునీటిని అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. నీటిసరఫరా కాని ప్రాంతాల ప్రజలు బోర్ల సాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని అవసరాలకు నీటిని వినియోగించుకున్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ పాఠశాలలో గీతా జయంతి

అక్కయ్యపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ ఉన్నత పాఠశాలలో సోమవారం గీతా జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలను, గీత ఆవిర్భావం, వికాసాలు, గొప్పతనాన్ని వివరించారు. రోజూ ఒక శ్లోకం చదవడం ద్వారా విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


53వ వార్డులో మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్


పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సంక్షేమ పథకాలతో పేదలకు తోడ్పాటు : ఎంపీ శ్రీభరత్

మర్రిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేసి వారి సంక్షేమానికి తోడ్పాటు ఇవ్వడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. 53వ వార్డులో సోమవారం ఆయన పలువురికి పింఛన్ డబ్బు అందజేసి మాట్లాడారు. పేదల కష్టాల్లో కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ చేయూత ఇస్తుందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు, వీఎంఆర్డీఏ చైర్మన్, కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, సచివాలయాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ వెంట టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, సనపల వరప్రసాద్, కార్తీక్ కుట్టా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డాబాగార్డెన్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 31వ వార్డులోని కనకలవీధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై స్వయంగా పలువురికి నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రమిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. అక్కడ స్థానికుల సమస్యలు విని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

24, 25 వార్డులలో...

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 24, 25 వార్డులలో వృద్ధులు, వితంతువులు, వివిధ ప్రతిభావంతులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నార్త్ నియోజకవర్గం బీజేపీ కార్యాలయం ఇంచార్జ్ శ్యామల దీపిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్త లబ్ధిదారులకు పింఛన్లు


దివ్యాంగ మహిళకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి, వాణిజ్యవిభాగం ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీప్రసాద్, సీహెచ్ రమణమ్మలు పంపిణీ చేశారు. 27వవార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జిల ఆధ్వర్యంలో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాప్యం లేకుండా కొత్త స్పౌజ్ పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ, శివప్రసాద్, మజ్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీలు విజయవంతంగా అమలు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు విజయవంతంగా అమలు చేస్తోందని దక్షిణ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన పలువురికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ విప్లవాత్మక మార్పు అని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

నాలుగు వార్డులలో చురుగ్గా పంపిణీ

కంచరపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర వర్గాల ప్రజలకు అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జీవీఎంసీ 48, 55, 56, 57 వార్డుల్లో కూటమి నాయకులు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భరోసా పింఛన్లను అందజేశారు. జీవీఎంసీ 55వ వార్డులో టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత ఇంటింటికీ వెళ్లి అందజేశారు. గంగన్న నగర్, జోగారావు నగర్, జాఘవానగర్ తదితర ప్రాంతాల్లో అర్హులకు అందచేశారు. 54వ వార్డులో టీడీపీ, బీజేపీ అధ్యక్షులు కుట్టా కార్తీక్, రంగు ముద్ర రాంబాబు పంపిణీ చేశారు. 56 వార్డులో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ

సీతంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి సీతంపేట హిందూ, ముస్లిం కాలనీలో రూ.49 లక్షలతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన సదుపాయాలను సమయానుగుణంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఎక్కడైనా స్థానిక అవసరాలు, సమస్యలు ఉంటే వాటిని ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే జీవీఎంసీ కమిషనర్‌కు చెప్పి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన కమ్యూనిటీ భవనాన్ని ప్రజలకు ఉపయోగకరంగా, సామాజిక కార్యక్రమాలకు మరింత అనుకూలంగా ఉండేలా అన్ని సదుపాయాలతో నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, గొలగాని వీరారావుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, ఉత్తర ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ శ్యామల దీపిక, నారా కిషోర్, ఇసరపు వాసు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్లపై సౌరశక్తి పలకల ఏర్పాటుకు ఒప్పందం


ఒప్పంద పత్రం చూపుతున్న సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఇరు సంస్థల ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పుపై సౌరశక్తి పలకల ఏర్పాటు కోసం ఏపీఈపీడీసీఎల్ సంస్థ సద్భవ్ ప్యూచర్‌టెక్ లిమిటెడ్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, డైరెక్టర్ ఆపరేషన్స్ టీవీ సూర్య ప్రకాష్‌ల సమక్షంలో కార్పొరేట్ కార్యాలయంలో సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద నర్సీపట్నం, పాలకొండ, పెద్దాపురం, రామచంద్రపురం, టెక్కలి, విజయనగరం రూరల్, తాడేపల్లి గూడెం డివిజన్లలోని 44,998 ఎస్సీ, ఎస్టీల సర్వీసులకు మొత్తం 90 మెగావాట్ల సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సోలార్

పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని సుమారు 2 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రతి వినియోగదారుని ఇంటి మీద 200 చదరపు అడుగుల ప్రాంతంలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

బాలికలకు కరాటే శిక్షణ


శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ జానకిరామ్

కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ (కరాటే) శిక్షణను ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బాలికలకు ఆత్మ రక్షణకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందని హెచ్ఎం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సుమారు రెండు నెలల పాటు జరగనున్న ఈ శిక్షణలో బాలికలకు వివిధ మెలకువలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్, బాలికలు ఒంటరిగా ఉన్నప్పుడు ఇబ్బందులకు గురైతే ఏవిధంగా తమను తాము రక్షించుకోవాలనే అంశాలను వివరిస్తారన్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధినేత లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత బుల్లయ్య కళాశాల


చాంపియన్ బుల్లయ్య కళాశాల జట్టుతో అతిథులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నీలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజి చాంపియన్‌గా నిలిచింది. సోమవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో బుల్లయ్య కాలేజి 2-1 గోల్స్ తేడాతో ఏయూ కాలేజి ఆఫ్ ఆర్ట్స్‌పై గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకున్నది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ ఎ.పల్లవి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య కాలేజి వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ గోపీకృష్ణ, పి.కిషోర్, డాక్టర్ దిలీప్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనలో యువత పాత్ర కీలకం

ఏడాదికి రెండు ఇంజక్షన్లతో ఎయిడ్స్ నుంచి విముక్తి : డా.కూటికుప్పల సూర్యారావు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కూటికుప్పల సూర్యారావు తదితరులు

విశాఖపట్నం/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి రెండు ఇంజక్షన్లతో ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చునని ప్రముఖ వైద్యుడు డా.కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. కొత్తగా ఆవిష్కరించిన మందులతో ఏడాదికి రెండు ఇంజక్షన్లతో సాధారణ జీవితం గడపవచ్చునన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి రోగి చరిత్ర ఆధారంగా అత్యుత్తమ చికిత్స అందించడానికి అవకాశం ఉందన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కంచరపాలెంలో అవగాహన కల్పించారు. దేశంలో హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గినప్పటికీ 25 లక్షల మంది హెచ్‌ఐవీతో జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డా.సుధాదేవి, డా.అచ్యుతరావు, డా.శ్రవణ, డా.అశ్విని తదితరులు పాల్గొన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల పిలుపునిచ్చారు. అవగాహన కల్పించడం ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఎయిడ్స్ చిహ్నం ఆకారంలో కూర్చొని అవగాహన కలిగించారు. వైస్ ప్రిన్సిపాల్ నివేదిత, కె.గీతాంజలి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కేఎల్ శిరీష, జె.లావణ్య, అనురాధ, బి.హైమావతి పాల్గొన్నారు. హెచ్‌ఐవీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి మద్దతు ఇవ్వడంపై వాల్తేరు రైల్వే ఆసుపత్రిలో ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు మనోధైర్యాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రంతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు హెచ్‌ఐవీ వ్యాప్తి నివారణ అంశాలపై అవగాహన కల్పించడంలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. డా.కె.మాణిక్యకుమారి, డా.హరిణి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ చిహ్నం ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు


రైల్వే ఆసుపత్రి ఆవరణలో ఎయిడ్స్ వ్యాధిపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది తదితరులు



సెయింట్ జోసెఫ్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు

వైభవంగా అంబలం పూజ


ఆకట్టుకుంటున్న అయ్యప్ప స్వామి మండపం, పూజలో పాల్గొన్న భక్తులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియం కళావాణి మైదానంలో పూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ పైల ఆదిమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబలం పూజను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శబరిమల మున్ మేలు శాంతి ఎంఎస్ రాజ్‌కుమార్ పడిపూజ నిర్వహించారు. పైల ఆదిమోహన్ రెడ్డి ప్రత్యేక పూజా ఏర్పాట్లు చేశారు. పడిపూజ మహోత్సవంలో భాగంగా ఉదయం 6 గంటలకు అయ్యప్ప అభిషేకం, అనంతరం అన్నాభిషేకం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం నాలుగు గంటలకు సాయి షణ్ముఖ రెసిడెన్సీ నుంచి లక్ష్మీ దీపారాధన, తిరువీధి ఊరేగింపులో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. తెనాలి భజన బృందం భాస్కర్ భక్తి గీతాలను ఆలపించగా, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు పడిపూజలో పాల్గొన్నారు. పుష్ప, విద్యుత్ దీపాలంకరణలతో పోర్టు స్టేడియం నయనానందకరంగా కనిపించింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు సీతమ్మధార పి అండ్ టి కాలనీలో గల ప్రభుత్వ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌లు చేతుల మీదుగా విద్యార్థులకు పోషక ఆహార పదార్థాలను అందచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు అందే పిల్లల్లో చాలా మంది ఉదయం, అల్పాహారం తినకుండా రావడాన్ని గుర్తించిన అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు ఉదయం పోషకాహార కార్యక్రమాన్ని వారంలో మూడు రోజులు అందించేందుకు ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగిందని, బలవర్ధకమైన చిరు ధాన్యాలతో తయారు చేసిన చెక్కి, వేయించిన వేరుశెనగలు, వేయించిన స్నాక్స్, ప్రోటీన్ బార్ వంటి అందిస్తామన్నారు. పిల్లలు పాఠశాలకు చేరుకున్న తరువాత ఉదయం అసెంబ్లీ అనంతరం వడ్డించడం, మంగళవారం, గురువారం, శనివారం వీటిని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 2026 వరకు దాతల సహకారంతో నిర్వహిస్తామని అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు యదురాజా దాస్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రమాదంపై ఫోరెన్సిక్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

తెగిపోతుండడంతో ప్రత్యేక విభాగాల్లో మరిన్ని సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. దాంతో యాజమాన్యం ఏర్పాట్లలో నిమగ్నమైంది. అంతేకాకుండా ప్లాంటులో విధులకు వచ్చే ప్రతి ఒక్కరు యాజమాన్యం జారీ చేసిన ఐడీ కార్డును(ఒరిజినల్) ధరించాలని ఆదేశించింది. కొందరు కలర్ జెరాక్స్ కాపీలు లామినేషన్ చేయించి వినియోగిస్తున్నారని, వాటిని అనుమతించమని స్పష్టంచేసింది.

నగరానికి మణిహారం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటన్నింటితో విశాఖకు పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కైలాసగిరిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఈఈ మధుసూదనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జలం.. పుష్కలం

... 5వ పేజీ తరువాయి

మండలం పాండ్రంకిలో 5.33 మీటర్ల నుంచి 3.26 మీటర్లకు, విశాఖ ఉక్కు కర్మాగార ప్రాంతంలో 4.08 మీటర్ల నుంచి 3.43 మీటర్లకు చేరుకుంది. పెందుర్తిలో 6.76 మీటర్ల నుంచి 3.94 మీటర్లు, మారికవలసలో 9.71 నుంచి 7.62, మధురవాడలో 11.63 నుంచి 10.51 మీటర్లు పైకి వచ్చింది. కాగా ఎండాడలో 12.73 మీటర్ల నుంచి 13.91 మీటర్లకు, గాజువాక కణితికాలనీలో 10.38 నుంచి 11.8 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవలో 15.06మీటర్ల నుంచి 14.1 మీటర్లకు, సెంట్రల్ పార్కులో 12.5 నుంచి 11.05 మీటర్లకు తగ్గినా నీటి వినియోగంపై ఒత్తిడి కొనసాగుతోంది.

శతశాతం ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అక్షరాస్యులను చేయడం ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆడియో, వీడియో పాఠాలతోపాటు రాయడం, చదవడం, చిన్నచిన్న కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యక శాస్త్రం, జీవ, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కార్యక్రమాలు అమలుచేస్తారు.

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిరక్షరాస్యులకు ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో విశాఖ జిల్లాలోనూ నిర్వహిస్తామని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో నిరక్షరాస్యులకు వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, చిన్నపాటి కూడికలు, తీసివేతలు, సంతకం నేర్పుతున్నామన్నారు. ఒక వాచకం కూడా అందజేశామన్నారు.

క్రీడా విభాగంపై 'మహా' నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే సాహసం చేయలేకపోవడంతో క్రీడా రంగం కుదేలయింది. గత ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించలేదు. ఉద్యోగులకు, కార్పొరేటర్లకు ఆటలపోటీలు జరగలేదు. ఏడాదిన్నరలో జీవీఎంసీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

12 చోట్ల క్రీడా ప్రాంగణాలు

జీవీఎంసీకి 12 చోట్ల క్రీడా ప్రాంగణాలున్నాయి. భీమిలి మునిసిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలు ఉన్నాయి. జోన్-3 పరిధిలో రేసపువానిపాలెం వద్ద స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, పెదవాల్తేరు రైతుబజార్ వెనుక లాన్‌టెన్నిస్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, వన్‌టౌన్‌లో ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం, గాజువాక వికాస్‌నగర్‌లో రాజీవ్ ఇండోర్ క్రీడా ప్రాంగణం, శ్రీహరిపురం కోరమండల్‌గేట్ ఎదురుగా అవుట్‌డోర్ క్రీడాప్రాంగణం, అనకాపల్లిలో ఎన్టీఆర్ అవుట్‌డోర్ స్టేడియం, రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియం , ఆర్కేబీచ్ వద్ద జీవీఎంసీ ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎంవీపీకాలనీలో స్మార్ట్‌సిటీకింద నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా ఉన్నాయి. వీటి నిర్వహణకు ఉద్యోగులు, వసతులు ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులపై స్వార్థం, వారిపై వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి కీలకమైన ఎంవీపీకాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా, బీచ్‌రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రైవేటుకు అప్పగించేయడంతో సామాన్యులు శిక్షణ పొందలేని పరిస్థితి ఏర్పడింది. స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం, గాజువాక వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ క్రీడాప్రాంగణం, భీమిలిలోని మునిసిపల్ ఇండోర్‌స్టేడియం ఏళ్లుగా ఆధునికీకరణ పేరుతో మరమ్మతులు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కమిషనర్ కేతన్‌గార్గ్ స్వర్ణభారతి పనులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 రోజుల్లో పూర్తిచేయాల్సిందేనని స్పష్టంచేశారు.



ఆక్రమిత స్థలంలో నిర్మాణం

పశుసంవర్ధక శాఖ స్థలాల ఆక్రమణ

ఆరిలోవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 12వ వార్డు పార్వతీనగర్‌లో పశు సంవర్ధకశాఖ స్థలాలను కొందరు ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయల విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ శాఖ డిప్యూటీ డైరక్టర్ నీలయ్య దృష్టికి ఆక్రమణల విషయం తీసుకెళ్లగా ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయించి ఖాళీ చేయిస్తామన్నారు.

ఆన్‌లైన్‌లో టికెట్ తీసుకుంటే శీఘ్రదర్శనం

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం ఆన్ లైన్‌లో టికెట్లు పొందిన భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించనున్నట్టు ఈఓ ఎన్. సుజాత తెలిపారు. ఈమేరకు సింహగిరిపై ఆలయ పరిసరాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సోమవారం ఆమె దేవస్థానం ఈఈ వెంకట రమణ, ఇతర అధికారులతో కలిసి క్యూలైన్ల పను లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు భక్తులకు ఆన్ లైన్ సేవల టికెట్లు, దర్శనం, వసతుల టికెట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఏఈ రవి రాజ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

భీమునిపట్నం,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీ స్టేడియంలో ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రికెట్, త్రోబాల్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఎంఈఓ శివరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి భీమిలి నుంచి పురుష ఉపాధ్యాయులకు ఎంపికలు నిర్వహించారు. అలాగే మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించి, జోనల్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.

రికార్డులు లేని బైక్‌లు సీజ్

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రాంతాలతో పాటు బాలాజీనగర్, బైపాస్ రోడ్డులో భీమిలి పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీపీ ఆదేశాల మేరకు సీఐ బి. తిరుమలరావు, ఎస్ఐ భరత్‌కుమార్, ట్రైనీ ఎస్ఐ భవ్య, హెచ్‌సీ అప్పలరాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్రాలు లేని ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 బీరు సీసాలు, 4 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ).
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిశు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 60, గుత్తి/రవి వంకాయలు 60, బెండకాయలు 56, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 60, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, చిక్కుడు 56, దోస కాయలు 22, పోటల్స్ 52, వె ల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35,బీట్‌రూట్ 42, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన 5, చుక్కకూర 3, పాల కూర 3, తోటకూర 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	630
విజయనగరం	634
శ్రీకాకుళం	634

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

తీరంలో సౌకర్యాల కొరత..సందర్శకుల కలత

» ఆర్‌కే బీచ్ వద్ద అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ
» కొన్నిచోట్ల నిరుపయోగం
» ఉన్నచోట సదుపాయాలు కరువు



బీచ్ వద్ద అధ్వానంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లు



అపరిశుభ్రతగా నిర్వహణ

బీచ్ రోడ్డు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకుల తాకిడితో కిటకిటలాడే సముద్ర తీరం వద్ద ప్రజా మరుగుదొడ్లు దుర్భరంగా మారాయి. కనీస వసతుల్లేక సందర్శకులు సతమతమవుతున్నారు. మరుగుదొడ్లలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. జీవీఎంసీ నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గతంలో లక్షలాది రూపాయలు వీటికోసం వెచ్చించారు. సరైన నిర్వహణ లేక మూతపడ్డాయి. దీంతో స్థానికులు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. బీచ్ రోడ్డు వద్ద పిల్లల మరుగుదొడ్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. టాయిలెట్‌కు వెళ్తే 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ధరల పట్టిక కనిపించకుండా దుప్పటితో కట్టి మూసేశారు. ఇక్కడి పరిస్థితి చూసి సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ మరుగుదొడ్లను గుత్తేదారులకు అప్పజెప్పడం వల్ల వారు తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతో దూర ప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- నిర్వహణ ఏది ?

బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకండి ... మరుగుదొడ్లను వాడండి .... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి అని ప్రతి సమావేశాల్లో హితోక్తులు చెప్పే అధికారులు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో తీర ప్రాంతానికి వచ్చే సందర్శకులు కనీసం మూత్ర విసర్జనకు కూడా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను మరమ్మతులు చేయించడంతో పాటు నిర్వహణపై దృష్టిపెట్టి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నాసిరకం కోక్ వినియోగంపై విచారణ జరపాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తారస్థాయికి చేరుకున్న అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నాసిరకం కోక్ వాడుతున్నారని, దీని వల్ల నాణ్యత లేని స్టీల్ ఉత్పత్తి అవుతుండడంతో కొనుగోలుదారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. కేంద్రం కావాలనే ఇలాంటి తప్పుడు విధానాలకు పాల్పడుతోందని, విశాఖ ఉక్కు నాణ్యతలో బ్రాండ్ విలువను చెడగొట్టాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాసిరకం ఇనుప ఖనిజం కోక్ వినియోగించటంపై సీబీఐకి ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో ఆయనతో పాటు నాయకులు జగ్గునాయుడు, కుమార్ ఉన్నారు.

హనుమత్ వ్రతానికి శ్రీకారం

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ వ్రతానికి సోమవారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఏటా మార్గశిర మాస శుక్లపక్ష దశమి నుంచి త్రయోదశి వరకు హనుమత్ వ్రతాన్ని నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ఈమేరకు ఆలయ అర్చకుడు రమేశ్ సారథ్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసి రుత్విక్ వరుణలు ఇచ్చారు. తరువాత పండితులు రామాయణంలోని సుందరీ కాండ పారాయణను ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అర్చకులు ఆంజనేయస్వామికి విశేష పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చారు.

కాలి నడకన కాశీ యాత్రకు భక్తులు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం అర్చకుడు పుల్లేటికుర్తి ఆంజనేయశర్మ కాలినడకన కాశీ యాత్రకు సోమవారం ప్రయాణమయ్యారు. స్థానిక శివ, కేశవ ఆలయ ఆవరణలో ఆలయాల సముదాయం సింగిల్ ట్రస్టీ రొంపిచెర్ల సింగరాచార్యుల ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించి యాత్రకు సాగనంపారు. ఈ సందర్భంగా ఆంజనేయ శర్మ మాట్లాడుతూ జనవరిలో మొదటిసారిగా కాలినడకన కాశీ యాత్రకు వెళ్లి ఫిబ్రవరిలో వచ్చానని తెలిపారు. ఆయనతో పాటు పట్టణానికి చెందిన రాజేష్, జి. లక్ష్మి, నర్సీపట్నంకు చెందిన దింతుకుర్తి స్వర్ణ నాగేశ్వరరావు, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామ ఆయుర్వేద వైద్యుడు వెంకటరమణ కూడా కాశీ యాత్రకు బయలుదేరారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు అందాయని జడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆయన వినతులు స్వీకరించారు. 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వార్డులోని తాగునీటి సమస్య, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు గురించి వినతిపత్రం అందించారు. 2వ వార్డు వైసీపీ ఇన్‌ఛార్జి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ వార్డు నాయకులు ప్రజా సమస్యలను వివరించారు.

అలరించిన భక్తి గీతాలాపనలు

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సం గీత నీరాజనం కార్యక్రమం సోమవారం రాత్రి సింహగిరిపై నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు కొమాండూరి వెంకట కృష్ణ తన గాత్ర మాధుర్యంతో ఆలపించిన గీతాలు భక్తులను అలరించాయి. మవుడూరి సత్యనారాయణశర్మ వయోలిన్‌పై, కమలాకర్ యోగేష్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. కచేరీ తరువాత దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ తిరుమలేశ్వరరావు వారిని ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు.

తీర ప్రాంతాల్లో వణికిస్తున్న చలి

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం నేపథ్యంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. చల్లని గాలులకు ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం నుంచీ చల్లని గాలులు వీస్తున్నాయి. ప్రతిరోజూ పర్యాటకులతో సందడిగా ఉన్న భీమిలి, సాగర్‌నగర్, తదితర తీర ప్రాంతాలు ఎవరూ లేక వెలవెలబోయాయి.

మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎండాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫేస్ బుక్‌లో తనకు తెలిసిన వాళ్ల వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్న ఫొటోలను డౌన్లోడ్ చేసుకుని వాటిని అసభ్యకరమైన ఫొటోలుగా మార్ఫింగ్ చేసి మహిళను వేధిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన మహిళకు ఫేస్‌బుక్ అకౌంట్‌లో తెలియని వ్యక్తి అసభ్యకరమైన మెసేజ్‌లతో పాటు ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టు చేసి, వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి కాకినాడ జిల్లాకు చెందిన తాటికాయల దివాకర మారుతి సత్యతేజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వస్త్ర ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో స్టాల్స్ నిర్వాహకులతో కలిసి పాల్గొన్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల, తదితరులు

హోటల్ గ్రీన్ పార్కులో చేనేత వస్త్ర ప్రదర్శన

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటల్ గ్రీన్ పార్కులో సోమవారం చేనేత వస్త్ర సముదాయం 'వసంతం' పేరుతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధునాతన చేనేత వస్త్ర ప్రదర్శనను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు వారు స్వయంగా తయారు చేసిన వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 64 స్టాల్స్‌లో కలంకారి, బాందిని, గుజరాతి, అస్సాం చేనేత వస్త్రాలతో పాటు ఏటికొప్పాకకు చెందిన పలు రకాల బొమ్మలను ప్రదర్శనలో ఉంచారు. మంగళవారం కూడా ఈ ప్రదర్శన కొనసాగుతుంది.



ఎంపీపీ కాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న మేయర్ పీలా, పక్కన ఎమ్మెల్యే వెలగపూడి

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఎంపీపీ కాలనీలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణి, గొలగాని పోలారావు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ పరిధికి చెందిన 13వ వార్డులోని పలు ప్రాంతాలలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది కలసి సోమవారం ఉదయం ఇళ్ల వద్ద పంపిణీ చేశారు. వార్డులోని దీనదయాళపురం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, సాయినగర్, విష్ణుపురకాలనీ, ఎర్ని దుర్గానగర్, ఏఎస్ఆర్ నగర్, శివాజీ పాలెం, ఏఎస్ఆర్‌నగర్, సిద్దార్థ బీసీ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలో పింఛన్లు అందించారు. సీనియర్ నాయకులు పి., ధర్మారావు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15వ వార్డులో..

వెంకోజీపాలెం : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో నూతనంగా విడుదలైన స్పౌజ్ పింఛన్లను వార్డు కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్, ఇతర నాయకులు అందజేశారు. భర్త పెన్షన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు పెన్షన్‌లు మంజూరు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిబ్బన్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

మద్దిలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన సాధ్యమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చెప్పారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిలో 15 నుంచి 49 ఏళ్ల మధ్యలో ఉన్న వారే 90 శాతం ఉంటున్నారన్నారు. అవగాహన లేకపోవడం, లైంగిక సంబంధాల వలనే యువత హెచ్ఐవీ బారినపడుతున్నారన్నారు. అందుకే విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, రెడ్‌రిబ్బన్, రెడ్‌క్రాస్, ఉన్నత అభియాన్ ప్రతినిధులు సాయికృష్ణ, టి.రామకృష్ణ, ఎస్.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : అంబేడ్కర్ గురుకులం నుంచి శ్రీకృష్ణాపురం వరకు ఎయిడ్స్ వ్యాధి ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీని నిర్మూలన అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలని నినదించారు.

పంచాయతీరాజ్ శాఖాధికారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉన్నతాధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐఐఎం విశాఖపట్నం ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఉన్నతాధికారులకు లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. 50 మందికి పైగా గెజిటెడ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ కమిషనర్ ముత్యాలరాజు రేవు, పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు, అడిషనల్ కమిషనర్ ఎం. సుధాకరరావు, ఐఐఎం డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

పక్కాగా వికలాంగుల హక్కుల చట్టం అమలు

» **జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

వెంకోజీపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(వీడీఈఏ) విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'వికలాంగుల హక్కుల చట్టం 2016', 'ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల చట్టం రూల్స్ 2023' పుస్తకాల ఆవిష్కరణ సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తన కార్యాలయంలో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వికలాంగుల హక్కుల చట్టాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. వారి హక్కులను పరిరక్షించడంలో జిల్లా అధికారులంతా ముందుండాలని, చట్టాలను అమలు చేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం వీసీఈఏ విశాఖ జిల్లా శాఖకు ఒక మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రమేష్, వీసీఈఏ మహిళా కార్యదర్శి ధనలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్. జ్యోతి, కవిత, పలువురు ప్రతిభావంతులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

» **ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వార్డు స్థాయి నుంచి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చెప్పారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో రూ.54 లక్షలతో రక్షణ గోడ, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి వాడవాడలా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, అండర్ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నిత్యం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, కార్యదర్శి మళ్ల రవికుమార్, డొక్కర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినదిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టీ.నూకరాజు, ఉరికూటి రాజులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారులు తగిన రీతిలో స్పందించటం లేదన్నారు. ప్రజారోగ్యం, నీటి సరఫరా కార్మికుల తీర్మానాలు అమలు చేయని కారణంగా కొత్త సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే, నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి వివిధ సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

32 మంది నిరాశ్రయుల తరలింపు

డాబాగార్డెన్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచన మేరకు మిషన్ తమసోమా జ్యోతిర్గమయలో భాగంగా విశాఖ కంట్రోల్ రూం పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఒక మహిళ సహా మొత్తం 32 మంది నిరాశ్రయులను రెస్క్యూ చేసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ డే అండ్ నైట్ షెల్టర్, భీమ్‌నగర్‌లోని షెల్టర్‌కు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రప్పించి, భిక్షాటనకు ప్రోత్సహించవద్దని చెప్పి అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ సీఐ భాస్కరరావు, ఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కిరణ్‌ప్రతాప్, కేర్ టేకర్లు శాంతి,ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారని తెలిపారు.

విద్యుత్ లైన్లు మార్పు చేయాలి

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న వీధి లైట్లకు వైర్లు మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వీధి లైట్లకు తాటితూరు గ్రామ పొలాల మధ్య నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల పొలం మధ్యలో వైర్లు తెగిపోయినా.. మరమ్మతుకు గురైనా బాగుచేయడానికి ఇబ్బంది కలుగు తోంది. వైర్ల తెగితే గొల్లలపాలెం గ్రామానికి సరఫరా నిలిపివేసి పనులు చేపడుతున్నారు. దీనివల్ల గ్రామస్తులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామానికి వెళ్లే మట్టి రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటికి పొలాల మధ్య నుంచి వెళుతు న్న లైను ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. తాటితూరు ప్రధాన రహదారి నుంచి నగరపాలెం వెళ్లే రోడ్డు పక్కనున్న శివాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఈ విద్యుత్ లైను కలిపితే అక్కడి నుంచి నేరుగా వీధి లైట్లకు సరఫరా అందుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యర్థాల నిర్వహణపై వర్క్‌షాప్

సాగర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల్లో వ్యర్థాల నిర్మూలన, రక్షిత మంచినీటి సరఫరాకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సర్క్యులర్ ఎకానమి అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిలో సర్క్యులర్ ఎకానమి అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బ్రిజేష్ కుమార్ దూబే మాట్లాడుతూ పట్టణాల నుంచి వెలువడే వ్యర్థాల్లో 60 శాతం ఆర్గానిక్ వ్యర్థాలు ఉన్నాయని తెలిపారు. సర్క్యులర్ ఎకానమి వ్యర్థాలను తగ్గించడానికి తిరిగి వాటిని ఏదో ఒక విధంగా ఉపయోగించడానికి నిర్దేశించిన ఆర్థిక వ్యవస్థ అని వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ అశ్వనీకుమార్ తివారీ మాట్లాడుతూ నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ ఏవిధంగా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో సౌదీ అరేబియా ప్రొఫెసర్ నబీసాట్ ముబారక్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పరిశోధకుడు డాక్టర్ గణేశ్ కుమార్, ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ డి. ముకుంద్, వర్క్‌షాప్ కన్వీనర్లు సుభాష్‌చంద్ర, ఈశ్వరరావు పాల్గొన్నారు.

5న అంతర్ కళాశాలల ప్రతిభాపోటీలు


బ్రోచరు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 5న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. సోమవారం కళాశాలలో బ్రోచర్లు ఆవిష్కరించారు. విద్యార్థులలో భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ప్రతిభాపాటవాలు ప్రోత్సహించేందుకు ద్వితీయ భాషావిభాగం మూడు సంవత్సరాలుగా ఈ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కళాశాల విద్యార్థినులతో పాటు విశాఖపట్నంలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధిపతి డా.జె.నిర్మల, డా.దీప్తి, పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో ఏకాదశి పూజలు, తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అంతరాలయంలో లోకకల్యాణార్థం అన్న సంకల్పం తో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు.స్వామివారికి షోడశోపచారాలు సమర్పించిన అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రాల నడుమ తిరువీధి ఉత్సవం జరిపారు.

అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు

వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో విశిష్టాద్వైత మత ప్రచారకులు తిరుమంగై అళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. సోమవా రం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను, ఆళ్వార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను పారాయణం చేశారు.

వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో 2026 సంవత్సరానికి కొత్త కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సిహెచ్.సత్యసూర్యవరప్రసాదరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, ఎన్.ప్రకాశరావులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.సత్యశ్రీరామ్, సహాయ కార్యదర్శిగా కె.వెంకటవర్మ, కోశాధికారిగా వీరబాబు, జాలి వాకర్‌గా కె.రాజారావులను క్లబ్ సభ్యులు ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నారు. వీరితో పాటు 9 మంది బోర్డ్ ఆఫ్ డైరక్టర్లుగా నియమితులయ్యారు. వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపకులు ఎన్.బుచ్చయ్య, కృష్ణప్రసాద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జనవరి నుంచి ఎన్నికైన కొత్త కార్యవర్గసభ్యులు బాధ్యతలు తీసుకుంటారని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. పార్కు మరింత పూర్తి స్థాయిలో ఉన్నతి చెందడానికి కొత్త కార్యవర్గసభ్యులు కృషిచేయాలని ఆకాంక్షిస్తు క్లబ్ మెంబర్లు కొత్త కమిటీ సభ్యులను అభినందించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఎన్నికకు వినతి

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ఏపీ స్పోర్ట్సు సెల్ చైర్మన్ జీవీఎస్ కమలాకర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. జగదాంబ జంక్షన్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రతినిధి సునీల్ అహ్రేన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పార్టీ పరిశీలకులు అమర్జహ బేబి, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

మురళీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ రోడ్డులోని బ్లాక్ నంబర్-15 వాటర్ పంప్‌హౌస్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో సోమవారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ పంప్‌హౌస్ నుంచి సరఫరా అయ్యే 46, 47, 48 వార్డుల్లోని నివాసిత ప్రాంతాలకు నీరందలేదు. పనుల కారణంగా తాత్కాలికంగా సరఫరాను ఆపేసినట్లు జీవీఎంసీ తాగునీటి విభాగం ఏఈ సుమన్ తెలిపారు. మంగళవారం నుంచి యథావిధిగా తాగునీటిని అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. నీటిసరఫరా కాని ప్రాంతాల ప్రజలు బోర్ల సాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని అవసరాలకు నీటిని వినియోగించుకున్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ పాఠశాలలో గీతా జయంతి

అక్కయ్యపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ ఉన్నత పాఠశాలలో సోమవారం గీతా జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలను, గీత ఆవిర్భావం, వికాసాలు, గొప్పతనాన్ని వివరించారు. రోజూ ఒక శ్లోకం చదవడం ద్వారా విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


53వ వార్డులో మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్


పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సంక్షేమ పథకాలతో పేదలకు తోడ్పాటు : ఎంపీ శ్రీభరత్

మర్రిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేసి వారి సంక్షేమానికి తోడ్పాటు ఇవ్వడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. 53వ వార్డులో సోమవారం ఆయన పలువురికి పింఛన్ డబ్బు అందజేసి మాట్లాడారు. పేదల కష్టాల్లో కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ చేయూత ఇస్తుందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు, వీఎంఆర్డీఏ చైర్మన్, కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, సచివాలయాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ వెంట టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, సనపల వరప్రసాద్, కార్తీక్ కుట్టా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డాబాగార్డెన్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 31వ వార్డులోని కనకలవీధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై స్వయంగా పలువురికి నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రమిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. అక్కడ స్థానికుల సమస్యలు విని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

24, 25 వార్డులలో...

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 24, 25 వార్డులలో వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నార్త్ నియోజకవర్గం బీజేపీ కార్యాలయం ఇంచార్జ్ శ్యామల దీపిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్త లబ్ధిదారులకు పింఛన్లు


దివ్యాంగ మహిళకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి, వాణిజ్యవిభాగం ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీప్రసాద్, సీహెచ్ రమణమ్మలు పంపిణీ చేశారు. 27వవార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జిల ఆధ్వర్యంలో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాప్యం లేకుండా కొత్త స్పౌజ్ పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ, శివప్రసాద్, మజ్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీలు విజయవంతంగా అమలు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు విజయవంతంగా అమలు చేస్తోందని దక్షిణ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన పలువురికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ విప్లవాత్మక మార్పు అని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

నాలుగు వార్డులలో చురుగ్గా పంపిణీ

కంచరపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర వర్గాల ప్రజలకు అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జీవీఎంసీ 48, 55, 56, 57 వార్డుల్లో కూటమి నాయకులు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భరోసా పింఛన్లను అందజేశారు. జీవీఎంసీ 55వ వార్డులో టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత ఇంటింటికీ వెళ్లి అందజేశారు. గంగన్న నగర్, జోగారావు నగర్, జాంబవానగర్ తదితర ప్రాంతాల్లో అర్హులకు అందచేశారు. 54వ వార్డులో టీడీపీ, బీజేపీ అధ్యక్షులు కుట్టా కార్తీక్, రంగుముద్ర రాంబాబు పంపిణీ చేశారు. 56 వార్డులో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ

సీతంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి సీతంపేట హిందూ, ముస్లిం కాలనీలో రూ.49 లక్షలతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన సదుపాయాలను సమయానుగుణంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఎక్కడైనా స్థానిక అవసరాలు, సమస్యలు ఉంటే వాటిని ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే జీవీఎంసీ కమిషనర్‌కు చెప్పి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన కమ్యూనిటీ భవనాన్ని ప్రజలకు ఉపయోగకరంగా, సామాజిక కార్యక్రమాలకు మరింత అనుకూలంగా ఉండేలా అన్ని సదుపాయాలతో నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, గొలగాని వీరారావుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, ఉత్తర ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ శ్యామల దీపిక, నారా కిషోర్, ఇసరపు వాసు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ


శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ జానకిరామ్

కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ (కరాటే) శిక్షణను ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బాలికలకు ఆత్మ రక్షణకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందని హెచ్ఎం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సుమారు రెండు నెలల పాటు జరగనున్న ఈ శిక్షణలో బాలికలకు వివిధ మెలకువలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్, బాలికలు ఒంటరిగా ఉన్నప్పుడు ఇబ్బందులకు గురైతే ఏవిధంగా తమను తాము రక్షించుకోవాలనే అంశాలను వివరిస్తారన్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధినేత లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత బుల్లయ్య కళాశాల


చాంపియన్ బుల్లయ్య కళాశాల జట్టుతో అతిథులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నీలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజి చాంపియన్‌గా నిలిచింది. సోమవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో బుల్లయ్య కాలేజి 2-1 గోల్స్ తేడాతో ఏయూ కాలేజి ఆఫ్ ఆర్ట్స్‌పై గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకున్నది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ ఎ.పల్లవి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య కాలేజి వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ గోపీకృష్ణ, పి.కిషోర్, డాక్టర్ దిలీప్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై సౌరశక్తి పలకల ఏర్పాటుకు ఒప్పందం


ఒప్పంద పత్రం చూపుతున్న సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఇరు సంస్థల ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పుపై సౌరశక్తి పలకల ఏర్పాటు కోసం ఏపీఈపీడీసీఎల్ సంస్థ సద్భవ్ ఫ్యూచర్‌టెక్ లిమిటెడ్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, డైరెక్టర్ ఆపరేషన్స్ టీవీ సూర్య ప్రకాష్‌ల సమక్షంలో కార్పొరేట్ కార్యాలయంలో సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద నర్సీపట్నం, పాలకొండ, పెద్దాపురం, రామచంద్రపురం, టెక్కలి, విజయనగరం రూరల్, తాడేపల్లి గూడెం డివిజన్లలోని 44,998 ఎస్సీ, ఎస్టీల సర్వీసులకు మొత్తం 90 మెగావాట్ల సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సోలార్

పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని సుమారు 2 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలపై ఉచితంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రతి వినియోగదారుని ఇంటి మీద 200 చదరపు అడుగుల ప్రాంతంలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

ఎయిడ్స్ నిర్మూలనలో యువత పాత్ర కీలకం

ఏడాదికి రెండు ఇంజక్షన్లతో ఎయిడ్స్ నుంచి విముక్తి : డా.కూటికుప్పల సూర్యారావు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కూటికుప్పల సూర్యారావు తదితరులు

విశాఖపట్నం/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి రెండు ఇంజక్షన్లతో ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చునని ప్రముఖ వైద్యుడు డా.కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. కొత్తగా ఆవిష్కరించిన మందులతో ఏడాదికి రెండు ఇంజక్షన్లతో సాధారణ జీవితం గడపవచ్చునన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి రోగి చరిత్ర ఆధారంగా అత్యుత్తమ చికిత్స అందించడానికి అవకాశం ఉందన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కంచరపాలెంలో అవగాహన కల్పించారు. దేశంలో హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గినప్పటికీ 25 లక్షల మంది హెచ్‌ఐవీతో జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డా.సుధాదేవి, డా.అచ్యుతరావు, డా.శ్రవణ, డా.అశ్విని తదితరులు పాల్గొన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల పిలుపునిచ్చారు. అవగాహన కల్పించడం ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఎయిడ్స్ చిహ్నం ఆకారంలో కూర్చొని అవగాహన కలిగించారు. వైస్ ప్రిన్సిపాల్ నివేదిత, కె.గీతాంజలి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కేవీఎల్ శిరీష, జె.లావణ్య, అనురాధ, బి.హైమావతి పాల్గొన్నారు. హెచ్‌ఐవీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి మద్దతు ఇవ్వడంపై వాల్తేరు రైల్వే ఆసుపత్రిలో ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు మనోధైర్యాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రంతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు హెచ్‌ఐవీ వ్యాప్తి నివారణ అంశాలపై అవగాహన కల్పించడంలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. డా.కె.మాణిక్యకుమారి, డా.హరిణి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ చిహ్నం ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు



రైల్వే ఆసుపత్రి ఆవరణలో ఎయిడ్స్ వ్యాధిపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది తదితరులు



సెయింట్ జోసెఫ్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు

వైభవంగా అంబలం పూజ


అకట్టుకుంటున్న అయ్యప్ప స్వామి మండపం, పూజలో పాల్గొన్న భక్తులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియం కళావాణి మైదానంలో పూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ పైల ఆదిమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబలం పూజను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శబరిమల మున్ మేలు శాంతి ఎంఎన్ రాజ్‌కుమార్ పడిపూజ నిర్వహించారు. పైల ఆదిమోహన్ రెడ్డి ప్రత్యేక పూజా ఏర్పాట్లు చేశారు. పడిపూజ మహోత్సవంలో భాగంగా ఉదయం 6 గంటలకు అయ్యప్ప అభిషేకం, అనంతరం అన్నాభిషేకం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం నాలుగు గంటలకు సాయి షణ్ముఖ రెసిడెన్సీ నుంచి లక్ష్మీ దీపారాధన, తిరువీధి ఊరేగింపులో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. తెనాలి భజన బృందం భాస్కర్ భక్తి గీతాలను ఆలపించగా, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు పడిపూజలో పాల్గొన్నారు. పుష్ప, విద్యుత్ దీపాలంకరణలతో పోర్టు స్టేడియం నయనానందకరంగా కనిపించింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు సీతమ్మధార పి అండ్ టి కాలనీలో గల ప్రభుత్వ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌లు చేతుల మీదుగా విద్యార్థులకు పోషక ఆహార పదార్థాలను అందచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు అందే పిల్లల్లో చాలా మంది ఉదయం, అల్పాహారం తినకుండా రావడాన్ని గుర్తించిన అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు ఉదయం పోషకాహార కార్యక్రమాన్ని వారంలో మూడు రోజులు అందించేందుకు ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగిందని, బలవర్ధకమైన చిరు ధాన్యాలతో తయారు చేసిన చెక్కి, వేయించిన వేరుశెనగలు, వేయించిన స్నాక్స్, ప్రోటీన్ బార్ వంటి అందిస్తామన్నారు. పిల్లలు పాఠశాలకు చేరుకున్న తరువాత ఉదయం అసెంబ్లీ అనంతరం వడ్డించడం, మంగళవారం, గురువారం, శనివారం వీటిని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 2026 వరకు దాతల సహకారంతో నిర్వహిస్తామని అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు యదురాజా దాస్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రమాదంపై ఫోరెన్సిక్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

తెగిపోతుండడంతో ప్రత్యేక విభాగాల్లో మరిన్ని సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. దాంతో యాజమాన్యం ఏర్పాట్లలో నిమగ్నమైంది. అంతేకాకుండా ప్లాంటులో విధులకు వచ్చే ప్రతి ఒక్కరు యాజమాన్యం జారీ చేసిన ఐడీ కార్డును(ఒరిజినల్) ధరించాలని ఆదేశించింది. కొందరు కలర్ జెరాక్స్ కాపీలు లామినేషన్ చేయించి వినియోగిస్తున్నారని, వాటిని అనుమతించమని స్పష్టంచేసింది.

నగరానికి మణిహారం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటన్నింటితో విశాఖకు పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కైలాసగిరిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఈఈ మధుసూదనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జలం.. పుష్కలం

... 5వ పేజీ తరువాయి

మండలం పాండ్రంకిలో 5.33 మీటర్ల నుంచి 3.26 మీటర్లకు, విశాఖ ఉక్కు కర్మాగార ప్రాంతంలో 4.08 మీటర్ల నుంచి 3.43 మీటర్లకు చేరుకుంది. పెందుర్తిలో 6.76 మీటర్ల నుంచి 3.94 మీటర్లు, మారికవలసలో 9.71 నుంచి 7.62, మధురవాడలో 11.63 నుంచి 10.51 మీటర్లు పైకి వచ్చింది. కాగా ఎండాడలో 12.73 మీటర్ల నుంచి 13.91 మీటర్లకు, గాజువాక కణితికాలనీలో 10.38 నుంచి 11.8 మీటర్లకు పడిపోయాయి. ఆరిలోవలో 15.06మీటర్ల నుంచి 14.1 మీటర్లకు, సెంట్రల్ పార్కులో 12.5 నుంచి 11.05 మీటర్లకు తగ్గినా నీటి వినియోగంపై ఒత్తిడి కొనసాగుతోంది.

శతశాతం ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అక్షరాస్యులను చేయడం ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆడియో, వీడియో పాఠాలతోపాటు రాయడం, చదవడం, చిన్నచిన్న కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యక శాస్త్రం, జీవ, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కార్యక్రమాలు అమలుచేస్తారు.

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిరక్షరాస్యులకు ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో విశాఖ జిల్లాలోనూ నిర్వహిస్తామని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో నిరక్షరాస్యులకు వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, చిన్నపాటి కూడికలు, తీసివేతలు, సంతకం నేర్పుతున్నామన్నారు. ఒక వాచకం కూడా అందజేశామన్నారు.

క్రీడా విభాగంపై 'మహా' నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే సాహసం చేయలేకపోవడంతో క్రీడా రంగం కుదేలయింది. గత ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించలేదు. ఉద్యోగులకు, కార్పొరేటర్లకు ఆటలపోటీలు జరగలేదు. ఏడాదిన్నరలో జీవీఎంసీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

12 చోట్ల క్రీడా ప్రాంగణాలు

జీవీఎంసీకి 12 చోట్ల క్రీడా ప్రాంగణాలున్నాయి. భీమిలి మునిసిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలు ఉన్నాయి. జోన్-3 పరిధిలో రేసపువానిపాలెం వద్ద స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, పెదవాల్తేరు రైతుబజార్ వెనుక లాన్‌టెన్నిస్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, వన్‌టౌన్‌లో ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం, గాజువాక వికాస్‌నగర్‌లో రాజీవ్ ఇండోర్ క్రీడా ప్రాంగణం, శ్రీహరిపురం కోరమండల్‌గేట్ ఎదురుగా అవుట్‌డోర్ క్రీడాప్రాంగణం, అనకాపల్లిలో ఎన్టీఆర్ అవుట్‌డోర్ స్టేడియం, రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియం , ఆర్కేబీచ్ వద్ద జీవీఎంసీ ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎంవీపీకాలనీలో స్మార్ట్‌సిటీకింద నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా ఉన్నాయి. వీటి నిర్వహణకు ఉద్యోగులు, వసతులు ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులపై స్వార్థం, వారిపై వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి కీలకమైన ఎంవీపీకాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా, బీచ్‌రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రైవేటుకు అప్పగించేయడంతో సామాన్యులు శిక్షణ పొందలేని పరిస్థితి ఏర్పడింది. స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం, అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం, గాజువాక వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ క్రీడాప్రాంగణం, భీమిలిలోని మునిసిపల్ ఇండోర్‌స్టేడియం ఏళ్లుగా ఆధునికీకరణ పేరుతో మరమ్మతులు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కమిషనర్ కేతన్‌గార్గ్ స్వర్ణభారతి పనులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 రోజుల్లో పూర్తిచేయాల్సిందేనని స్పష్టంచేశారు.

పీజీఆర్ఎస్‌కు 13 వినతులు

గాజువాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 13 వినతులు అందాయి. వాటిలో ముఖ్యంగా రోడ్లకు మరమ్మతులు, కుక్కల బెడద నివారించాలని కోరుతూ ఆయా కాలనీ ప్రజలు, ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపారాలను తొలగించాలని వినతి పత్రాలు అందజేశారు. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వేపగుంటలో 11 అర్జీలు..

వేపగుంట: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు అందాయి. వీటిలో ముఖ్యంగా నాయుడు తోట జంక్షన్ నుంచి ఆర్ఆర్‌వీపురం వరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించాలని, 94వ వార్డు గౌతమ్‌నగర్‌లో వీధిరోడ్లు, డ్రైనేజీలు మరమ్మతులు చేయించాలని, 95వ వార్డు చిమలాపల్లి వెళ్లే మార్గంలో తుప్పలు తొలగించాలని, సర్వేనంబరు 59లోని కొన్ని ప్రాంతాల్లో తమ స్థలాల్లో అక్రమంగా వేసిన డెబ్రిస్‌ను తొలగించాలని, తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని జడ్సీ హెచ్ శంకరరావు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రింకోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు కేసులు, భూమి తగాదాలు, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు, నీరు, రాజీపడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టి కేసులు వంటి తదితర కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

ముగ్గురికి అవయవదానం


రాజాబాబు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాను మరణిస్తూ మరో ముగ్గురికి ప్రాణదానం చేశాడు మహోన్నత వ్యక్తి ఆయన. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన మేడిసెట్టి రాజాబాబు (48) గత శనివారం ఇంటి వద్ద కుప్పకూలిపోవడంతో చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాజాబాబును పరీక్షించిన వైద్యులు అతని మెదడులో రక్తం గడ్డకట్టుకుపోయిందని, దీంతో అపస్మారక స్థితిలో ఉన్నాడని గుర్తించారు. వెంటనే వైద్యం ప్రారంభించారు. ఆదివారం అతని బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జీవన్‌దాన్ వైద్య బృందం అవయవదానం గురించి రాజబాబు కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు అంగీకరించారు. ఈ సందర్భంగా కాలెయం, ఊపిరితిత్తులు, రెండు కార్నియాలను సేకరించారు. ఊపిరితిత్తులను సికింద్రబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. మిగిలిన అవయవాలను స్థానిక ఆస్పత్రిలో ఉంచారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 60, గుత్తి/రవి వంకాయలు 60, బెండకాయలు 56, పచ్చిమిర్చి 40, బజ్జిపకోడి మిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడలు(కిలో) 90, అల్లం (పాతది) 60, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, చిక్కుడు 56, దోస కాయలు 22, పోటల్స్ 52, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 42, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కందదుంప 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 50, కూరాపెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	630
విజయనగరం	634
శ్రీకాకుళం	634

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


గోపాలపట్నం: పింఛన్లు పంపిణీ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు


వేపగుంట: పింఛన్ల పంపిణీలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో ప్రజా ప్రతినిధులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యేల హామీ

వేపగుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వం పనిచేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 93వ వార్డులో భరత్‌నగర్ దరి గొల్లనారాయణపురం నూకాలమ్మ గుడి ఆవరణలో సోమవారం ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడా ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా శైలజ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గోపాలపట్నం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 89, 92వ వార్డుల్లో పింఛన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా పింఛన్ల పంపిణీ

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 58వ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పంఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆరున్నర నుంచి తొమ్మిది గంటల వరకు దాదాపు రెండు వందల మందికి ఆయనే స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం అధికారులతో చర్చలు జరిపి తమ దృష్టికి వచ్చిన సమస్యలను దశల వారీగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యాటనలో జీవీఎంసీ జోన్5 కమిషనర్ రాము, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సర్కారు కృషి

గాజువాక: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ 66వ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు అన్నారు. వార్డులో సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేస్తోందని, రాష్ట్ర ప్రగతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. గాజువాక నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పేదలకు వరం

ఆటోనగర్: జీవీఎంసీ 71, 86, 87, 88 వార్డుల్లో ఉన్న సచివాలయాల పరిధిలో సోమవారం పింఛన్ల పంపిణీలు జరిగాయి. ఈ సందర్భంగా 71వ వార్డు శ్రీనగర్, శ్రీరామ్ నగర్ సచివాలయాల పరిధిలో టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని అన్నారు. కూర్మన్నపాలెంలో టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ , క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్ పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 87వ వార్డు వడ్లపూడి సచివాలయంలో కార్పొరేటర్ బొండా జగన్ పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. 88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

95 శాతం పంపిణీ పూర్తి

పెదగంట్యాడ: మండంలోని సామాజిక పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయింది. ఈ సందర్భంగా సచివాయాల సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పింఛన్లను ఉదయం నుంచే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 75వ వార్డులో కార్పొరేటర్ పులిలక్ష్మీబాయ్, 76వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు తమ వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం అందుబాటులో లేని లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు అందజేస్తున్నట్టు సచివాలయ అధికారులు, సిబ్బంది తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఆసరా

అగనంపూడి: వృద్ధులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా ఆసరాగా నిలుస్తోందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు అందరూ కృషి చేయాలి

- ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా గాజువాక, పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల్లో అవగాహన ర్యాలీలు


గోపాలపట్నం: ఎయిడ్స్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు

గోపాలపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెహరా నర్సింగ్ కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని స్థానిక బెహరా నర్సింగ్ కళాశాల విద్యార్థులు నరవ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక: ప్రాణంతక ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, దీని కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. డిజైర్ సొసైటి గాజువాకలో సోమవారం ఏర్పాటు చేసిన ఎయిడ్స్ నివారణ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధిత పిల్లలను అక్కున చేర్చుకోవడం మంచి విషయమన్నారు. ఈ మహమ్మారి బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అక్కిన లక్ష్మణరావు, సీరట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో..

ఉక్కుటౌన్‌షిప్: ఇస్లాంపేట జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగ ప్రిన్సిపాల్ జె.వి వేకానందరావు మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ఏ ఇబ్బంది ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎయిడ్స్ నివారణకు అవగాహన కల్పించడం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో ఉన్న ఐసీటీసీ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ నివారణ అవగాహ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఐసీటీసీ కౌన్సెలర్ సురేశ్‌కుమార్, ఎల్టి హేమలత పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఆర్‌కే. దొర మాట్లాడుతూ సమాజం నుంచి ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని అన్నారు. అనంతరం కూడలిలో విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది మానవహారం చేసి ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. హెచ్ఐవీ రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

32 మంది నిరాశ్రయుల తరలింపు


నిరాశ్రయులను జీవీఎంసీ ఏయూటీడీ షెల్టర్‌కు తరలించిన దృశ్యం

డాబాగార్డెన్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచన మేరకు మిషన్ తమసోమా జ్యోతిర్గమయలో భాగంగా విశాఖ కంట్రోల్ రూం పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఒక మహిళ సహా మొత్తం 32 మంది నిరాశ్రయులను రెస్క్యూ చేసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ డే అండ్ నైట్ షెల్టర్, భీమ్‌నగర్‌లోని షెల్టర్‌కు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రప్పించి, బిక్షాటనకు ప్రోత్సహించవద్దని చెప్పి అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ సీఐ భాస్కరరావు, ఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కిరణ్‌ప్రతాప్, కేర్ టేకర్లు శాంతి,ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారని తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

50 శాతం రాయితీతో కుట్టు మిషన్లు అందజేత

సింధియా, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డు న్యూకాలనీ బ్రహ్మకుమారీస్ కేంద్రంలో, బ్రహ్మకుమారీ రామేశ్వరి పర్యవేక్షణలో స్వయం ఉపాధి సహాయ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళలకు కట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు రోజుల ఉచిత శిక్షణతో పాటు మెడిటేషన్ కూడా ఉంటుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. శిక్షణ అనంతరం పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు ఇస్తున్నట్టు వెల్లడించారు. అలాగే 50 శాతం రాయితీతో కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, బ్రహ్మకుమారిలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల చట్టం అమల్లో జిల్లా ముందుండాలి

- యంత్రాంగానికి కలెక్టర్ సూచన


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(వీడీఈఏ) విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'వికలాంగుల హక్కుల చట్టం 2016', 'ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల చట్టం రూల్స్ 2023' పుస్తకాల ఆవిష్కరణ సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తన కార్యాలయంలో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వికలాంగుల హక్కుల చట్టాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. వారి హక్కులను పరిరక్షించడంలో జిల్లా అధికారులంతా ముందుండాలని, చట్టాలను అమలు చేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం వీసీఈఏ విశాఖ జిల్లా శాఖకు ఒక మైలు రాయిగా నిలిచింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, వీసీఈఏ మహిళా కార్యదర్శి ధనలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్.జ్యోతి, కవిత, పలువురు ప్రతిభావంతులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

హోటల్ గ్రీన్ పార్కులో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం


చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో స్టాల్స్ నిర్వాహకులతో కలిసి పాల్గొన్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటల్ గ్రీన్ పార్కులో సోమవారం చేనేత వస్త్ర సముదాయం 'వసంతం' పేరుతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధునాతన చేనేత వస్త్ర ప్రదర్శనను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మల్లిక్ కంకటాల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు వారు స్వయంగా తయారు చేసిన వస్త్రాల ను ఈ ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 64 స్టాల్స్‌లో కలంకారి, బాంధిని, గుజరాతి, అస్సాం చేనేత వస్త్రాలతో పాటు ఏటికొప్పాకకు చెందిన పలు రకాల బొమ్మలను ఈ ప్రదర్శనలో ఉంచారు. మంగళవారం కూడా ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

హైస్కూల్‌ను సందర్శించిన ప్రపంచబ్యాంకు బృందం


నడుపూరు హైస్కూల్‌లో ప్రపంచబ్యాంక్ బృందం

పెదగంట్యాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో పర్యావరణపరమైన అలవాట్లు అమలు స్థాయి, సామాజిక వ్యవస్థల అమలు తీరుపై మూల్యాంకన చేయడానికి ప్రపంచ బ్యాంక్ బృందం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రపంచబ్యాంక్ బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇటలీకి చెందిన అలసంద్రు డిరోస్, ప్రపంచ బ్యాంక్ సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్ దీప బాలకృష్ణన్, ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశా ల ఆవరణలో ఉన్న వివిధ రకాల వృక్షాలు, వాటిపైరాసిన చరిత్ర, క్యూఆర్ కోడ్ నమోదు వంటివాటిని పరిశీలంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రామాయణంలో వివిధ పేర్లతో ఉండే మొక్కలను చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బాలికల సౌకర్యం కోసం పాఠశాలలో ఎల్అండ్‌టీ సంస్థ ద్వారా ప్రత్యేక వసతులు కల్పించామని పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ ఈ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్ ప్రేమ్‌కుమార్, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్, రాష్ట్ర కోఆర్డినేటర్ వి.సతీశ్‌రెడ్డి, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన ఏపీఐఐసీ అధికారులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రెవెన్యూ నెంబరు 133/1లో ఏపీఐఐసీకి చెందిన స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వ 'భూమి అన్యాక్రాంతం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఏపీఐఐసీ అధికారులు స్పందించారు. దీంతో దువ్వాడ చేరుకున్న ఏపీఐఐసీ అధికారులు ఆ భూమి ఏపీఐఐసీకి చెందినది అని నిర్ధారించారు. అనధికార నిర్మాణాన్ని తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదనీ, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్ట రిత్యా శిక్షార్హులని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

'రాష్ట్ర ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

గాజువాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో రాష్ట్ర ప్రగతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని, ఆ పార్టీ కార్యకర్తలు చేసే విషప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వార్డులో అనుభంద కమిటీలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈ నెలలో 72 మంది 'ఉక్కు' ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల్లో ఈనెల 72 మంది పదవి విరమణ చేయనున్నారు. ఈ ఏడాది జూన్ నెలలో 238మంది, జూలైలో 121మంది ఉద్యోగులు పదవి విరమణ చేయగా, మరల ఈ నెల 72మంది పదవి విరమణ చేయనున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవి విరమణ చేయడం ప్లాంట్ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

లేబర్ కమిషనర్‌తో సమావేశం రేపు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఏడాదికి పైగా పూర్తి వేతనం ఇవ్వకపోవడం, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొట్టడం, ఈ నెల నుంచి ఉత్పత్తితో వేతనాలు ముడి పెట్టడం వంటి విషయాలపై యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను రీజనల్ కమిషనర్ దృష్టికి ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పలు విషయాలను చర్చించేందుకు బుధవారం యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లనున్నామని కేఎస్ఎన్.రావు తెలిపారు.

నాసిరకం కోక్ వినియోగంపై సీబీఐ విచారణ జరపాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తారస్థాయికి చేరుకున్న అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నాసిరకం కోక్ వాడుతున్నారని, దీని వల్ల నాణ్యత లేని స్టీల్ ఉత్పత్తి అవుతుండడంతో కొనుగోలుదారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. కేంద్రం కావాలనే ఇలాంటి తప్పుడు విధానాలకు పాల్పడుతోందని, విశాఖ ఉక్కు నాణ్యతలో బ్రాండ్ విలువను చెడగొట్టాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాసిరకం ఇనుప ఖనిజం కోక్ వినియోగించటంపై సీబీఐకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం మూడు రోజులకు సరిపడా ఇనుప ఖనిజం సైతం ఉండటం లేదని నర్సింగరావు విమర్శించారు. యాజమాన్యం అవినీతిని ప్రశ్నించిన కార్మికులను ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని, తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిసున్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

గోపాలపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజారావు అన్నారు. స్థానిక బాలాజీ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్‌లు, లైసెన్స్ లేనివారు వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు ప్రయాణం చేసే సమయంలో ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని వివరించారు. అనంతరం పాఠశాలలో బస్సులను తనిఖీలు చేసి, బస్సులను నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గాజువాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారందరికీ ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని 66వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గోమాడ వాసు అన్నారు. వార్డు పరిధిలో నివాసముంటున్న షేక్ నజీర్‌కు రూ.58వేలు, షేక్ పీర్ అహ్మద్‌కు రూ.40 వేలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

టీఎన్‌టీయూసీలో చేరికలు

గాజువాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా టీఎన్‌టీయూసీ ముందుకు సాగుతోందని స్టీల్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అన్నారు. పలు యూనియన్‌లకు చెందిన నాయకులు సోమవారం గాజువాక టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీలో చేరారు. వీరికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రిలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఏ కష్టం వచ్చినా టీఎన్‌టీయూసీ అండగా నిలుస్తుందని, సీఎం చంద్రబాబు ఆకాంక్షలను నెరవేర్చే విధంగా యూనియన్ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఆమె బోధన వినూత్నం

- పిల్లలను ఆకట్టుకునే రీతిలో పాఠాలు
- వీడియోలు, చార్టుల రూపకల్పన
- సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షకులు
- పినగాడి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ అలివేలి మంగకు మంత్రి లోకేశ్ అభినందన



విద్యార్థులతో ఉపాధ్యాయిని అలివేలి



పాఠ్యాంశాల చిత్రాలతో విద్యార్థినీ విద్యార్థులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): **సంప్రదాయ విధానంలో బోధన కంటే పిల్లలకు అర్థమయ్యేందుకు వినూత్న తరహాలో పాఠాలు చెబుతూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు ఉపాధ్యాయురాలు పల్దాసింగి అలివేలి. ఈ క్రమంలో అందరి మన్ననలు పొందుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో లక్షల వీక్షకులను సంపాదించుకున్న ఆమె, పిల్లల కోసం ఇంతవరకు 110 వీడియోలు రూపొందించారు. వాటిని వీక్షించిన మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ అలివేలి మంగ కృషిని ప్రశంసిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు.**

పెందుర్తి మండలం పినగాడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పల్దాసింగి అలివేలి మంగ పనిచేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన ఆమె 2014 డీఎస్సీలో ఎంపికై 2016లో ఎస్జీటీగా పెదబయలు మండలం బాసుల గ్రామంలో సుమారు ఎనిమిదేళ్లు పనిచేశారు. మండల కేంద్రానికి 25 కి.మీ. దూరంలో ఉన్న బాసుల వెళ్లాలంటే సుమారు ఆరేడు కిలోమీటర్లు కాలినడకన అడవిలో ప్రయాణించాలి. అయినప్పటికీ వెరవక ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి ఉత్తమ బోధనతో తల్లిదండ్రుల మన్ననలు పొందారు. టీచర్ల బదిలీల్లో భాగంగా 2023లో పెందుర్తి మండలం పినగాడి ప్రాథమిక పాఠశాలకు వచ్చారు.

నగరానికి ఆనుకుని ఉన్న పినగాడిలో చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ పరిస్థితులలో పిల్లలకు రొటీన్‌గా పాఠాలు బోధిస్తే ఫలితం ఉండదని గుర్తించిన ఆమె, వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. సబ్జెక్టు కంటే పిల్లలు ఇష్టపడేలా రైమ్స్, పాటలు, నృత్యాలు, బొమ్మలతో బోధన ప్రారంభించారు. పిల్లలకు అర్థమయ్యేలా, లాజికల్‌గా, వివరణాత్మకంగా బోధిస్తున్నారు. వాటిపై వీడియోలు రూపొందించారు. ప్రధానోపాధ్యాయుడు, పిల్లలను భాగస్వాములను చేశారు. రెండోతరగతి చదివే ఆయిషాతో ఫోర్ బుల్లెట్ పేరుతో వీడియోలు రూపొందించారు. దీనికి మంచి స్పందన వచ్చింది. మిస్ యూనిక్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోకు 1.65 లక్షల మంది వీక్షకులున్నారు. లక్షలలో లైక్‌లు వచ్చాయి. ఇలా 110 వీడియోలు రూపొందించారు. వీటిని తిలకించిన మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించి, అలివేలిమంగ ప్రతిభను అభినందించారు. ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పుతున్న తీరు చాలా బాగుంది. లెర్నింగ్ మేడ్ ఈజీ విత్ యాక్టివిటీస్ విధానం పిల్లల్లో చదువుపై ఆసక్తి కనబర్చుతుంది. యూనిక్ ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్, నో బ్యాగ్ డే యాక్టివిటీ, వర్డ్ బిల్డింగ్, ఎఫ్ఎల్ఎన్ ఆధారిత బోధనతో పాఠాలు బోధిస్తూనే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అలివేలిమంగ కృషి ప్రశంసనీయమని లోకేశ్ పేర్కొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతకు దోహదం



సెల్‌ఫోన్‌లు, టీవీలు వచ్చిన తరువాత పిల్లల ఆలోచనలు మారాయి. రొటీన్‌గా పాఠాలు బోధించడం కంటే కొత్త దనంతో చెబితే వారిలో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని భావించాను. పెదబయలులో ఉండగా కొంతవరకు అమలుచేశా. పినగాడి వచ్చిన తరువాత ప్రైవేటు పాఠశాలల పోటీ తట్టుకునేందుకు వినూత్న బోధనకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. తల్లిదండ్రులకు విషయం చెబుతూ పిల్లల్లో మానసిక వికాసం, చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. విద్యాశాఖ రూపొందించిన సిలబస్‌నే కొత్తగా బోధిస్తున్నాం. మంత్రి లోకేశ్ అభినందించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖాధికారులు, గ్రామస్థుల ప్రోత్సాహంతో వినూత్న రీతిలో బోధిస్తున్నా.

- పల్దాసింగి అలివేలిమంగ, ఎస్జీటీ, పినగాడి ప్రాథమిక పాఠశాల

బెంగళూరు-నారంగి మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా బెంగళూరు-నారంగి (అసోం) మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 06559 నంబరు గల రైలు ఈ నెల 2 నుంచి 23 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 5 గంటలకు నారంగి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 9.45 గంటలకు బెంగళూరు చేరుతుంది.

కిరండూల్‌కు అదనపు థర్డ్ ఏసీ కోచ్

విశాఖ-కిరండూల్ పాసింజర్ సర్వీసులకు అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-కిరండూల్‌కు ఈ నెల 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28న... కిరండూల్-విశాఖకు ఈ నెల 3, 5, 7, 9 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29న అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

రైళ్ల రీ షెడ్యూల్, మళ్లింపు

విజయవాడ డివిజన్‌లో నిర్మాణ పనుల నేపథ్యంలో జనవరి 28న అలెప్పీ-ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ (13352) కొవ్వూరు, రాజమండ్రి, కడియం మీదుగా నడుస్తుందని, గోదావరి స్టేషన్‌కు చేరదని సీనియర్ డీసీఎం తెలిపారు. జనవరి 30న ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) 1.08 గంటలు, టాటానగర్-బెంగళూరు (12889) 2.10 గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయన్నారు.

7న క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న పోర్టు డైమండ్ జూబ్లీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. పోటీల్లో అండర్-16, 18, 20 బాల, బాలికల విభాగాలతోపాటు సీనియర్ పురుషులు, మహిళలు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 93962 40008, 83094 17921, 98488 80242 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సందడిగా ఎమ్మెల్యే గంటా పుట్టిన రోజు వేడుకలు



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బధిర విద్యార్థులతో గంటా వేడుకలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు కార్యకర్తల కోలాహలం, అభిమానుల ఆనందోత్సాహాల మధ్య సోమవారం ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసానికి వచ్చి గంటాను పూలమాలలతో ముంచెత్తారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, మధురవాడ, సింహాచలం, సాగర్‌నగర్, తగరపువలస, కొమ్మాది, విశాఖ సిటీ, అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, పెందుర్తి, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాల నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీ పడ్డారు. రద్దీ నియంత్రణకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక అభిమాని భారీ కేకు తీసుకురాగా, ఇద్దరు దివ్యాంగ విద్యార్థులతో కలిసి గంటా కట్ చేశారు. మరో ఇద్దరు దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. అంతకుముందు సంపత్ వినాయగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సింహాచలం, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో గంటాను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. భీమిలి నియోజకవర్గంలో గంటా పేరిట అన్నదానం చేశారు.

అభినందనలు తెలిపిన మంత్రి

గంటా శ్రీనివాసరావు మిత్రులు ఆదివారం రాత్రి వాల్తేరు క్లబ్‌లో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పి.విష్ణుకుమార్‌రాజు, సుందరపు విజయకుమార్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, వరుణ్ గ్రూప్ అధినేత ప్రభుకిశోర్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ, వుడా మాజీ చైర్మన్ ఎస్ఏ రెహమాన్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల మల్లిక్, సన్ ఇంటర్నేషనల్ ఎండీ జాస్తి శ్రీకాంత్, పి.సోమనాథ్, సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ రాజు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సేవ చేసి రుణం తీర్చుకుంటా

తనపై ప్రేమ చూపిస్తున్న ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అభినందనలు తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా సొంత కుటుంబ సభ్యుడిగా ఆదరించి బ్రహ్మరథం పట్టడం ప్రజాభిమానానికి నిదర్శనమన్నారు. భీమిలిలో 92,401 ఓట్ల మెజార్టీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుంటానన్నారు.

హైదరాబాద్‌లో...

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకరు కె.రఘురామకృష్ణరాజు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, సీనియర్ నటులు మురళీమోహన్, సాయికుమార్, శ్రీకాంత్, అలీ, శివాజీరాజా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 237 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఒకే సమస్యపై పదేపదే అర్జీలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులతో కలిసిన 237 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూకు 89, జీవీఎంసీ 67, పోలీసు శాఖ 15, ఇతర విభాగాల నుంచి 69 ఉన్నాయి. అధికారులు తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కన్వేయర్ బెల్ట్ తెగిన ఘటనలో కుట్ర

స్టీల్‌ప్లాంట్‌లో కన్వేయర్ బెల్ట్ దుర్ఘటన యాజమాన్యం తప్పిదమని, నిజాలు నిగ్గు తేల్చేందుకు స్టీల్‌ప్లాంట్ సీఎండీని విధులకు దూరంగా ఉంచి నిపుణులతోజాయింట్ విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉద్యోగులే బెల్ట్ కోశారని యాజమాన్యం పేర్కొనడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు.

జీవీఎంసీలో 111 వినతులు

విశాఖపట్నం: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 111 ఫిర్యాదులు అందాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ ఫిర్యాదులను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు.

ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జోన్-2కు సంబంధించి 18, జోన్-3కు 16, జోన్-4కి తొమ్మిది, జోన్-5కి 11, జోన్-6కి 15, జోన్-8కి 11 ఫిర్యాదులు వచ్చాయి. విభాగాలవారీగా పరిశీలిస్తే ప్రధాన కార్యాలయానికి సంబంధించి 31, రెవెన్యూ విభాగానికి 13, ప్రజారోగ్యవిభాగానికి ఏడు, టౌన్‌ప్లానింగ్‌కు 48, ఇంజనీరింగ్ విభాగానికి 21, హార్టికల్చర్‌కు ఐదు, యూసీడీ విభాగానికి నాలుగు అర్జీలు ఉన్నాయి. సకాలంలో అన్నింటినీ పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి: కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఎయిడ్స్ బారిన పడిన చిన్నారులతో కలసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాగ్రత్తలను వివరించారు. సెక్స్ వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లు, లారీ డ్రైవర్లు తదితరులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు వస్త్రాలు, స్వ యం ఉపాధికి కుట్టుయంత్రాలు, పిల్లలకు స్కూల్‌బ్యాగ్‌లు, న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లిస్తేనే నగరాభివృద్ధి

- మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్
- సందడిగా జీవీఎంసీ ఆవిర్భావ దినోత్సవం



సకాలంలో పన్ను చెల్లించిన వారిని సత్కరిస్తున్న మేయర్, కమిషనర్

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అభివృద్ధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారుల సహకారం కీలకమని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. జీవీఎంసీ ఏర్పడి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా 'విశాఖ ప్రగతి బంధు' పేరుతో సోమవారం జీవీఎంసీ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సకాలంలో పన్ను చెల్లించినపలు కేటగిరీల్లోని వారిని సత్కరించారు. నగర పౌరుడిగా పన్నులను సకాలంలో చెల్లించడం బాధ్యతగా గుర్తించి ఏటా సకాలంలో చెల్లిస్తున్న వారిని సన్మానించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీవీఎంసీ పరిధిలో 3,600 కిలోమీటర్ల మేర రోడ్లు, కాలువలు ఉన్నాయని, వాటిని పరిశుభ్రంగా తీర్చిదిద్దడం ఆర్థికపరమైన అంశాలతో కూడుకున్నదన్నారు. పన్నులు సకాలంలో చెల్లిస్తున్న ఆరు కేటగిరీల్లోని అసెస్‌మెంట్‌దారులకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఇనిస్టిట్యూషన్ కేటగిరీలో అత్యధికంగా పన్ను చెల్లించిన కోరమాండల్ ఫెర్టిలైజర్స్, ఎస్సార్ స్టీల్స్, టెక్ మహీంద్రతో పాటు వ్యక్తిగత కేటగిరీలో కుమార్‌రాజా, వెంకట రాజశేఖర్‌బాబు, కందుకూరి జగదీష్‌బాబు, యాస్పిరేషన్ కేటగిరీలో ఆర్.చంటి, వై.నాగరత్నం, బి.ధర్మావతి, సీనియర్ సిటిజన్ కేటగిరీలో పి.శ్రీనివాసరావు, ఆర్‌వీజీ రామశాస్త్రి, మళ్ల వెంకన్నాయుడు, ఆర్‌డబ్ల్యూ ఏ కేటగిరీలో డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, వార్డు కేటగిరీలో అధికపన్ను వసూలుకు సహకరించిన కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, రాపర్తి త్రివేణివరప్రసాద్, ముక్కా శ్రావణిని సన్మానించారు. అనంతరం డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మేయర్, కమిషనర్ ఆదేశా లకు అనుగుణంగా అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి పన్ను వసూలు చేస్తున్నామన్నారు.

చిన్నారులకు న్యూట్రిషన్ ప్యాకెట్లు

- 49 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ
- అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో శ్రీకారం
- ప్రారంభించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



చిక్కీలు అందిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 321 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 49వేల మంది పిల్లలకు వారానికి మూడు రోజులపాటు మార్నింగ్ న్యూట్రిషన్ పేరిట బలవర్ధక ఆహారం ప్యాకెట్లు అందజేసే కార్యక్రమానికి అక్షయపాత్ర ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. వారంలో మంగళ, గురు, శనివారాలు ఉదయం పూట పాఠశాలలో ప్రార్థన ముగిసిన తరువాత విద్యార్థులకు వీటిని అందజేస్తారు. దీనిని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ప్రారంభించారు. మంగళవారం మిల్లెట్ బార్, గురువారం మసాలా వేరుశనగ పిక్కలు, శనివారం చెన్నా మసాలా ప్యాకెట్లు అందజేస్తారు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాలు ప్రభుత్వం వేరుశనగ చిక్కీలు అందజేస్తోంది. మిగిలిన మూడు రోజులు విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ న్యూట్రిషన్ ప్యాకెట్లు పంపిణీ చేయడానికి ముందుకు వచ్చింది. చాలా పాఠశాల్లో పిల్లలు అల్పాహారం తీసుకోకుండానే వస్తున్నారని గుర్తించిన సంస్థ బలవర్ధక ఆహారంతో కూడిన ప్యాకెట్లు అందించాలని నిర్ణయించింది. వారానికి మూడు రోజులు 35గ్రాముల బరువుతో ప్యాకెట్లు తయారుచేసి విద్యార్థులకు అందజేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు న్యూట్రిషన్ ఆహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి శ్రుతిసాగర్‌దాసు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఖోఖో జట్ల ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టుతో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, తదితరులు

లంకెలపాలెం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ - 14 బాల, బాలికల జాతీయస్థాయి ఖోఖో జట్లను లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: జె.హర్షవర్ధన్(విశాఖపట్నం), జి.మనోహర్‌నాయుడు(విశాఖపట్నం), టి.సూర్యనారాయణ(చిత్తూరు), ఎస్.బద్రీనాథ్(చిత్తూరు), టి.శృతిసాయి కీర్తన్(విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్(గుంటూరు), సి. నగేశ్(కర్నూల్), కె.వెంకటసాయి(ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి(తూర్పుగోదావరి), బి.కార్తీక్(శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్(కడప), కె.చరణ్ (విశాఖపట్నం).

బాలికల జట్టు: ఆర్.శృతిక(విశాఖపట్నం), ఆర్.లలితాదేవి (విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ(చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి (చిత్తూరు), జి.చందన (శ్రీకాకుళం), కె.పావని (విజయనగరం), టి.సింధు (ప్రకాశం.), ఎన్.బంధవిక (కృష్ణా), జి.అనుపమ(కడప), ఆర్.వీణ (అనంతపురం), టి.ప్రియ(తూర్పుగోదావరి).



జాతీయ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

15 నుంచి ఏయూ మైదానంలో సరస్ ఎగ్జిబిషన్

కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనె 15 నుంచి 26 వరకు సరస్ (సేల్ ఫర్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. డ్వాక్రా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసే నిమిత్తం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాల డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని వయసుల వారికి అవసరమైన వస్తువులు ఇక్కడి స్టాళ్లలో లభ్యమవుతాయన్నారు. ఎగ్జిబిషన్‌కు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి నోడల్‌అధికారిగా వ్యవహరిస్తారన్నారు.

యువకుడి ఆత్మహత్య


- అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసిన పోలీసులు



కిశోర్ (ఫైల్ ఫొటో)

సీతంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన దొండపర్తిలోని కుప్పిలివారి వీధిలో జరిగింది. నాలుగో పట్టణ పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుప్పిలివారి వీధికి చెందిన డి.కిశోర్(27)కు మౌనికతో 2023 డిసెంబరులో వివాహం జరిగింది. ప్రేమ వ్యవహారం కావడంతో పెద్దలకు ఇష్టంలేదు. కొంతకాలంగా దంపతుల మధ్య పెద్దల కారణంగా చిన్న చిన్న గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఆమె పలుమార్లు కిశోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం, పెద్దలు సర్దిచెప్పడం జరిగింది. ఈ క్రమంలో కిశోర్ మద్యానికి అలవాటుపడ్డాడు. ఆదివారం మళ్లీ గొడవ జరిగింది. అనంతరం రాత్రి కిశోర్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తరువాత ఏం జరిగిందో.. కొద్దిసేపటి తర్వాత మౌనిక తన అత్త శ్రీదేవికి ఫోను చేసి మీ అబ్బాయి ఉరేసుకుంటున్నాడని చెప్పింది. దీంతో కిశోర్ తల్లి శ్రీదేవి, తన బంధువులతో కలిసి అక్కడకు వెళ్లింది. అప్పటికే కిశోర్ మంచంపై అచేతనంగా పడి ఉన్నాడు. ఫ్యానుకు చున్నీ కట్టి ఉంది. ఇది చూసిన అతడి తల్లి, బంధువులు ఆస్పత్రికి తరలించినప్పటికీ అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఉమాకాంత్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



ఆకాశ్ కుమార్ (ఫైల్)

ఆటోనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటున్న గాలిపటమే బాలుడి పాలిట యమపాశమైంది. వివరాలిలా వున్నాయి. రాజస్థాన్ నుంచి గాజువాక వలస వచ్చిన సురేశ్‌కుమార్, కియాదేవి దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమారుడు ఆకాశ్‌కుమార్ (10) స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం గాలిపటం ఎగురవేస్తుండగా హైటెన్షన్ వైర్లకు చిక్కుకుంది. దానిని తీసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. తీవ్రంగా కాలిపోయిన ఆకాశ్‌ను తల్లి కియాదేవి స్థానికుల సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తండ్రి సురేశ్‌కుమార్ ఆటోనగర్‌లో ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు.